సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 21-2-2025 15/-

# ఢిల్లీ పీఠం






బడ్జెట్‌లో విద్యారంగానికి
20 శాతం నిధులు కేటాయించాలి

## సమాజానికి పునాది కుటుంబం



# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 8 హైదరాబాద్
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 రూ.15-00
21 షాబాన్ 1446 హిజ్రీ


## తొలిగీటు

విశ్వాసి మరొక విశ్వాసికి దర్పణం లాంటివాడు మరియు సోదరునితో సమానం. అతన్ని ఇతడు నాశనం కాకుండా కాపాడుతాడు. పరోక్షంగా కూడా రక్షిస్తాడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**






## లోపల...


| | | |
|---|---|---|
| నైతిక పతనం | ...... | 04 |
| ఢిల్లీ పీఠం | ...... | 05 |
| ఇస్లామ్‌లో ఆధ్యాత్మిక వ్యవస్థ - 2 | ...... | 10 |
| ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు ముస్లిం అభ్యర్థుల విజయం | ...... | 13 |
| ప్రేమించటం ఇస్లామ్ స్వభావం | ...... | 14 |
| బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ప్రత్యామ్నాయ కుట్రలు – ముస్లిం జగత్తు | ...... | 20 |
| చరితార్థులు–2 : వి.యం. ఒబేదుల్లాహ్ | ...... | 23 |
| ఇస్లామీయ ఉద్యమ లక్ష్యం–3 | ...... | 24 |
| సమాజానికి పునాది కుటుంబం | ...... | 26 |
| పశ్చాత్తాపం | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| పవిత్ర రమజాన్ మాసాన్ని హృదయపూర్వకంగా స్వాగతించాలి | ...... | 34 |


**తత్వం బోధపడిందట...**



మెగాస్టారు చిరంజీవి
రాజకీయ సన్యాసం
ఆలస్యంగా అయిన
తెల్సిందట రహస్యం!
మరలా జీవితంలో
రాజకీయమొద్దట
చావయినా రేవైనా
సినిమాలే ముద్దట!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## నైతికపతనం

రణవీర్ అలహాబాదియా వివాదం చాలా మందికి తెలిసే ఉంటుంది. నైతికపతనం పాతాళంలో ఉందని చెప్పడానికి ఇంతకు మించి ఉదాహరణ మరొకటి ఉండదు. అసలు ఈ వివాదమేమిటి అనే వివరాలు కూడా రాయలేని స్థాయిలో ఈ నైతికపతనం ఉంది. డార్క్ కామెడీ పేరుతో అత్యంత అసభ్యంగా, అశ్లీలంగా మాట్లాడడమే డార్క్ కామెడీ అయి పోయింది. ఇండియా గాట్ లేటెంట్ పేరుతో యూట్యూబులో వచ్చే ఒక కార్యక్రమంలో రణవీర్ చేసిన అత్యంత అసభ్యమైన, అనుచితమైన, పశుప్రవృత్తితో కూడిన వ్యాఖ్య ఇది. తల్లి దండ్రుల లైంగిక జీవితం గురించి చేసిన ఈ వ్యాఖ్య, ఆ వ్యాఖ్యపై సదరు కార్యక్రమంలో ఇతరుల నవ్వులు చూస్తుంటే సమాజంలో విలువల పతనం పాతాళానికి చేరుకుందని, పశుప్రవృత్తి రాజ్యమేలుతుందని స్పష్టమవుతోంది.

ఒక్క రణవీర్ గురించి మాత్రమే ఈ గగ్గోలు ఎందుకు, దేశంలో క్రియేటివిటీ పేరుతో జరుగుతున్న తమాషాలో ఇలాంటివి చాలా ఉన్నాయి. సోషల్ మీడియాలో మురికి ఇంతా అంతా కాదు. వాట్సప్ యూనివర్శిటీ ఫేక్ వార్తల ప్రచారం గురించి అందరికీ తెలుసు. దానివల్ల నష్టాలు కూడా చాలా మందికి ఇప్పుడు తెలుసు. కాని సోషల్ మీడియాలో క్రియేటివిటీ పేరుతో నడుస్తున్న ఈ అనైతికత అంతకన్నా ప్రమాదకరమైనది. రణవీర్ చేసిన వ్యాఖ్య అత్యంత నీచ మైనది, హేయమైనది, హీనమైనది. అయితే అంతకు ముందు ఇదే కార్యక్రమంలో వందశాతం అక్షరాస్యత ఉన్న కేరళ అని చెప్పడమే ఒక జోక్‌గా పడిపడి నవ్విన ఎపిసోడ్ కూడా ఉంది. అక్షరాస్యత సాధించడం నవ్వులపాలయ్యే విషయమా? ఇది డార్క్ కామెడీ రియాలిటీ. ఇది దేశంలో సోషల్ మీడియా క్రియేటివిటీ వాస్తవం. నిజానికి సాఫ్ట్ పార్న్ స్థాయికి చేరుకున్న కార్యక్రమాలున్నాయి. కాంటెంట్ క్రియేషన్‌లో వల్గారిటీ, షాక్, నిర్ఘాంతపోయేలా చేయడానికి అసభ్య, అశ్లీలతలను వాడుకోవడమే జరుగుతోంది. రోడ్లపై అర్థనగ్నంగా డాన్స్ చేసి వీడియో పెట్టడం, మెట్రోలో అలాంటి డాన్సు వీడియోలు, కేవలం బ్రా ధరించి రాత్రి రోడ్లపై నడిచి ప్రజల రియాక్షన్ వీడియో తీసి పెట్టడం కూడా జరిగింది. ఇండియా గేట్ వద్ద కేవలం టవల్ కట్టుకుని డాన్సు చేసి చూపించిన వీడియో పెట్టడం ఇలాంటివి ఎన్నో ఉన్నాయి.

దీనివల్ల సామాజిక నష్టాలు చాలా ఉన్నాయి.

ఆస్ట్రేలియాలో 16 సంవత్సరాల కన్నా చిన్న వయసు ఉన్న వారికి సోషల్ మీడియా నిషిద్ధం. మన పిల్లల చేతుల్లో మొబైల్ ఫోన్లు ఇస్తున్నాం. చిన్న చిన్న పిల్లల చేతుల్లో అన్ లిమిటెడ్ డాటాతో స్మార్ట్ ఫోన్లుంటున్నాయి. ఇప్పుడు ట్విటర్ లేదా ఎక్స్ ప్లాట్‌ఫారంపై పోర్నోగ్రఫి కూడా అనుమతించ బడిందట. పిల్లలు సోషల్ మీడియాలో ఏమేం చూస్తున్నారో కన్నేసి ఉంచడం ఎంత మంది చేస్తున్నారు? ఎంతమంది చేయగలరు? పిల్లల మానసిక స్థితిపై ఇది తీవ్రప్రభావం చూపిస్తుంది.

ఒకప్పుడు టీవీ వల్ల పడే ప్రభావం గురించి చర్చలు జరిగేవి. టీవీ కన్నా వేయిరెట్లు ప్రమాదకరమైనది సోషల్ మీడియా. టీవీ వల్ల మంచి కూడా ఉంది, అలాగే సోషల్ మీడియా వల్ల కూడా చెడుతో పాటు మంచి ఉంటుంది. చెడును దూరం చేసి మంచిని ప్రోత్సహించాలంటే సమాజంలో నైతిక విలువలు, ఆధ్యాత్మిక విలువలను ప్రోత్సహించాలి.

★★★

అశ్లీలత వ్యాపించాలని కోరేవారు, ప్రపంచంలోనూ, పర లోకంలోనూ వ్యధాభరితమైన శిక్షకు అర్హులు.

(దివ్యఖుర్‌ఆన్: 24:19)

అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి, బహిరంగ మైనవైనా సరే లేక గోప్యమైనవైనా సరే.

(దివ్యఖుర్‌ఆన్: 6:151)

అబ్దుల్ వాహెద్

# ఢిల్లీ పీఠం




**భారతీయ జనతా పార్టీ** ఢిల్లీలో ఘనవిజయం సాధించింది. ఇరవయ్యారు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత లభించిన విజయం ఇది. ఈ విజయం తర్వాత దేశంలో 28 రాష్ట్రాల్లో 19 బీజేపీ పాలన క్రిందికి వచ్చాయి.

బీజేపీ ఎన్నికల విజయాలు కేవలం ఎన్నికల విజయాలు మాత్రమే కాదు. అవి ఎన్నికల వ్యూహాలు అనడం కూడా పూర్తి వాస్తవాన్ని చిత్రీకరించదు. ఒక మొత్తం వ్యవస్థ అని చెప్పాలి. ఎందుకంటే, మీడియా బీజేపీ కోసమే పనిచేసింది. అనేక సంస్థలు బీజేపీ కోసమే పనిచేశాయి. డబ్బు వెదజల్లడం జరిగింది. వీటన్నింటికి మించి బీజేపీ విజయానికి కాంగ్రెస్ కూడా తోడ్పడింది.

ఇక్కడ రెండు విషయాలను మొదట పరిశీలిద్దాం. మొదటిది, బీజేపీ విజయం ఎలాంటి ప్రభావాన్ని వేస్తుందన్నది కాగా, రెండవది దేశంలో సెక్యులరిజాన్ని రక్షించే బాధ్యత కేవలం ముస్లిముల దేనా? అనే ప్రశ్న. ఈ రెండే కాదు, మరో ప్రశ్న కూడా ఉంది దేశంలో ముస్లిములు ఎన్నికల్లో ఏమాలోచించి ఓటేస్తున్నారనే ప్రశ్న కూడా కీలకమైనది.

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, అది సోకాల్డ్ సెక్యులర్ పార్టీ అయినా, లేక ముస్లిముల పట్ల బాహాటంగా వ్యతిరేకత ప్రదర్శిస్తున్న బీజేపీ అయినా, ఏ పార్టీ అయినా ముస్లిముల పట్ల ప్రభుత్వ వైఖరిలో మార్పు ఉండడం లేదు. ముస్లిములను నిర్లక్ష్యం చేయడం, వేధించడం, వివక్షల వాతావరణం కొనసాగుతూనే ఉంది. దీనికి చరిత్రే సాక్ష్యమిస్తుంది. హాషింపుర హింసాకాండ, నెల్లి ఊచకోతలు, ఢిల్లీ అల్లర్లు ... ఇలాంటి ఇంకెన్నో మతకలహాలు జరిగింది సోకాల్డ్ సెక్యులర్ పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడే. టాడా, ఉపా వంటి అత్యంత కఠినమైన, అమానుషమైన చట్టాలు చేసింది కాంగ్రెస్ పాలకులే. ఈ చట్టాలే అనేకమంది ముస్లిములను ఏళ్ళతరబడి జైళ్ళలో మగ్గేలా చేశాయి. ఇంతేకాదు, సెక్యులర్ ప్రభుత్వాల పరిపాలనలోనే దేశంలో ముస్లిముల పరిస్థితి దయనీయంగా మారింది. సచర్ నివేదికే దానికి సాక్ష్యం.

బీజేపీ బాహాటంగానే ముస్లిం వ్యతిరేక వైఖరి కనబరుస్తుంది. అందువల్ల బీజేపీ విజయం ప్రభుత్వ పని తీరులో పెద్ద మార్పేమీ రాదు. మార్పు వైఖరిలో వస్తుంది. మెజారిటేరియన్ ధోరణి ప్రభుత్వ

యంత్రాంగంలోను, ప్రభుత్వ సంస్థల్లోను అలుముకుంటుంది. బీజేపీ విజయం కేవలం ప్రజాస్వామికంగా దేశ ప్రజల అభిప్రాయంగా మాత్రమే కాదు, హిందూరాష్ట్ర దిశగా పురోగమనంగా కూడా పరిగణించబడుతుంది. ఇది దేశానికి మంచిదా? కాదా? అన్నది మొత్తం దేశప్రజలు ఆలోచించవలసిన విషయం. అంతే తప్ప కేవలం ముస్లిములకు మాత్రమే సంబంధించిన వ్యవహారం కాదు.

ప్రధాన స్రవంతి మీడియా వైఖరి అందరికీ తెలిసిందే. అధికార పార్టీకి దాసోహం అనే స్థితిలో ఉంది. అధికారపార్టీ ఐడియాలజీని ప్రచారం చేయడమే కాదు, ముస్లిములను విలన్లుగా చిత్రీకరించడం బీజేపీకి అవసరం కాబట్టి అలాంటి ప్రచారం చేయడంలోను, కథనాలను ఉత్పత్తి చేయడంలోను చురుగ్గా పనిచేస్తోంది. కరోనా జిహాద్ పేరిట జరిగిందేమిటో యావద్దేశం చూసింది. ఈ విలనీకరణ ద్వారా ముస్లిం సముదాయంపై జరిగిన, జరుగుతున్న హింసాకాండను సమర్ధించే వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. అంతేకాదు, ఈ విలనీకరణ ప్రచార ఉధృతిలో అసలు ప్రజా సమస్యలను ఎవ్వరు పట్టించుకోని పరిస్థితి వస్తోంది. ఈ ప్రాపగాండ, మెజారిటేరియన్ ధోరణల వికృతరూపమే మూకహత్యలు, ఆర్థికంగా బాయ్ కాట్ చేయాలనే పిలుపులు, ధార్మిక స్థలాలపై దాడులు వగైరా.

ఈ హింసాకాండను అడ్డుకోడానికి, లేదా నిరోధించడానికి ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందా? అలా కనిపించడం లేదు. పైగా మౌనప్రేక్షకుల్లా ఉండి ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సంభల్ జామా మస్జిదు వివాదాన్ని చూడండి. కేవలం ప్రజాప్రయోజక వ్యాజ్యం దాఖలైన 24 గంటల్లో మస్జిదు సర్వేకు ఆదేశాలు వచ్చేశాయి. జైశ్రీరామ్ నినాదాలు వినిపించాయి. మతపరమైన ఉద్రిక్తతలు పెరిగాయి.

దేశంలో అనేక సంఘటనలు పెరుగుతున్న మతవిభజనను సూచిస్తున్నాయి. బుల్డోజర్ చర్యలు న్యాయాన్ని నిలదీస్తున్నాయి. ముస్లిముల ఇళ్ళు, దుకాణాలపై బుల్డోజర్లు నడుస్తున్నాయి.

ది ఇండియా హేట్ ల్యాబ్ రిపోర్టు 2024 ప్రకారం 2023లో 668 విద్వేష ప్రసంగాలు నమోదయ్యాయి. ఇందులో 75 శాతం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనివే. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లోనే ఈ సంఘటనలు, విద్వేషప్రసంగాలు ఎక్కువగా వినిపించాయి. వీటిలో ముస్లిములకు వ్యతిరేకంగా హింసాకాండకు పిలుపు నివ్వడం వంటిది కూడా జరిగింది. కాస్త నిశితంగా గమనిస్తే బీజేపీ ఎన్నికల విజయాలతో పాటు ముస్లిం వ్యతిరేక విద్వేషం కూడా పెరుగుతున్నట్లు గమనించవచ్చు.

బీజేపీ బాహాటంగా ముస్లిములను వ్యతిరేకిస్తుంది కాబట్టి బీజేపీని ఓడించవలసిన బాధ్యత ముస్లిములదేనా? సాధారణంగా బీజేపీకి వ్యతిరేకంగానే ముస్లిములు ఓటు వేస్తారన్నది అందరికీ తెలిసిన విషయమే. ముస్లిముల ఓట్లు తమకు అవసరం లేదని కూడా బీజేపీ నేతలు బాహాటంగానే చెప్పిన సంఘటనలున్నాయి. అయినప్పటికీ ముస్లిముల ఓటింగ్ సరళి వల్లనే బీజేపీ గెలుస్తుందన్న మాటలు కూడా వినిపిస్తున్నాయి. ముస్లిములు తమ సముదాయానికి చెందిన ముస్లిం నేతకు ఓటు వేస్తే వారిని మతతత్వవాదులంటారు. కాని బీజేపీకి హిందువులు ఓటు వేస్తే అది మత తత్వంగా కనిపించదు. అది రాజకీయ వ్యూహం అంటారు.

బీజేపీకి వ్యతిరేకంగా అనేక సెక్యులర్ పార్టీలు రంగంలో ఉన్నప్పుడు ఓట్లు చీలిపోతున్నాయి. ముఖ్యంగా ముస్లిముల ఓట్లు చీలిపోతున్నాయి. ఫలితంగా బీజేపీ విజయాలు సాధించడం తేలికవుతుంది.

ఇటీవల ఢిల్లీ ఎన్నికలు దీనికి గొప్ప ఉదాహరణ. దాదాపు ఎనిమిది నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు అతి తక్కువ మెజారిటీతో గెలిచారు. కాంగ్రెస్ రంగంలో ఉండడం వల్ల బీజేపీకి లాభం కలిగిందని కూడా కొందరు తప్పుపడుతున్నారు. కాని కాంగ్రెస్ పట్ల ఆప్ పార్టీ వైఖరిని ఎవ్వరు ప్రశ్నించడం లేదు. ప్రతిపక్షాల ఐక్యత సాధించవలసిన బాధ్యత కేవలం కాంగ్రెస్ పార్టీదేనా? హర్యానాలో ఆప్ పార్టీ పోటీ చేసి కాంగ్రెసును ఎందుకు ఓడించింది? అలాగే గుజరాత్‌లోను కాంగ్రెస్ ఓటమి వెనుక కారణం ఆప్ కాదా? ఇప్పుడు ఢిల్లీలో ఆప్ ఓడిపోతే అది కాంగ్రెస్ వల్ల జరిగిందని నిందించడంలో అర్థమేముంది? ఆప్ అధికారంలో ఉన్నప్పుడు ముస్లిములకు చేసిందేముంది? ఢిల్లీ అల్లర్లలో కనీసం నోరు విప్పి మాట్లాడారా? షాహీన్ బాగ్ విషయంలో ఏం చేశారు? ముస్లిములకు సంబంధించిన వ్యవహారాల్లో కేజ్రీవాల్ వైఖరికి, మోడీ వైఖరికి పెద్ద తేడా లేదు. అయినా బీజేపీని ఓడించడానికి ముస్లిములు ఆప్‌కు మాత్రమే ఓటు వేయాలన్న వైఖరి అప్రజాస్వామికం. ప్రతిపక్ష ఐక్యత కాంగ్రెసుకు ఎంత అవసరమో, ప్రాంతీయ పార్టీలకు అంతే అవసరం. కాంగ్రెసును ప్రాంతీయ పార్టీలు ఓడిస్తే, ఇక నుంచి కాంగ్రెస్ కూడా ఈ సోకాల్డ్ సెక్యులర్ ప్రాంతీయ పార్టీలను ఓడించడానికి, అవసరమైతే బీజేపీ గెలుపునకు సహకరించడానికి కూడా సిద్ధమే అన్న సందేశం ఇప్పుడు ఢిల్లీ ఎన్నికలతో ఈ పార్టీలకు స్పష్టంగా అర్థమైనట్లు ఉంది. బీజేపీ గెలవడం అన్నది ఆ తర్వాత వరుసగా మొదలయ్యే వేధింపులకు కూడా కారణం అవుతుందన్నది కూడా ఈ ప్రాంతీయ పార్టీలకు తెలుసు. అందువల్లనే ఢిల్లీ ఎన్నికల

తర్వాత కాంగ్రెసు పట్ల ప్రాంతీయ పార్టీల స్వరం మారింది.

మరోవైపు మజ్లిస్ వంటి పార్టీలు రంగంలో ఉండడాన్ని కొందరు తప్పుపడుతున్నారు. మజ్లిస్ పార్టీ ఓట్లను చీల్చేసిందంటున్నారు. మజ్లిస్ ఎలా ఓట్లను చీల్చిందో, అలాగే కాంగ్రెస్ కూడా ఓట్లను చీల్చింది. ఇంకా ఎక్కువగా చీల్చింది. అందువల్లనే బీజేపీ గెలిచింది.

ఏది ఏమైనా కాంగ్రెస్‌పై ఒత్తిడి తీసుకువచ్చి అధిక ప్రయోజనాలు పొందాలన్న ప్రాంతీయ పార్టీల దురాశ ప్రతిపక్ష సమైక్యతకు గొడ్డలిపెట్టయ్యిందన్నది వాస్తవం. కాంగ్రెస్ మళ్ళీ క్షేత్రస్థాయిలో బలపడడానికి ఈ రాష్ట్రాల్లో బలంగా ఎన్నికల్లో పోటీ చేయడం ప్రారంభిస్తే ప్రాంతీయపార్టీల ప్రభుత్వాలు నిలబడలేవు. బీజేపీ గెలుపును అడ్డుకోవడమూ సాధ్యం కాదు. ఇందులో కాంగ్రెసును తప్పుపట్టడానికి కూడా ఏదీ లేదు. ఒక రాజకీయపార్టీగా కాంగ్రెస్ చేయవలసిందే చేస్తోంది.

మరోవైపు ముస్లిముల ఓట్లు చీలిపోవడం వల్లనే బీజేపీ గెలుస్తుం దన్న వాదన, విమర్శలు కూడా వస్తున్నాయి. కాని జరుగుతున్న దేమిటంటే, ముస్లిముల ఓట్లు చీలిపోయేలా పార్టీలు వ్యవహ రిస్తున్నాయి. ఫలితంగా లోక్‌సభలో ముస్లిముల ప్రాతినిథ్యం తగ్గిపోతోంది. ఇప్పుడు లోక్‌సభలో కేవలం 24 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారు. అంటే కేవలం 4.4 శాతం. 2014లో కేవలం 4.2 శాతం.

ఈ మొత్తం పరిస్థితిని గమనిస్తే, రెండు వాస్తవాలు మన ముందుకు వస్తాయి. దేశంలో సెక్యులరిజాన్ని కాపాడవలసిన బాధ్యత కేవలం ముస్లిములదే అన్న ధోరణిలో మాట్లాడుతున్న వాళ్ళు కొందరైతే, ప్రతిపక్ష ఐక్యతను కాపాడవలసిన బాధ్యత కేవలం కాంగ్రెసుదే అన్నట్లు మాట్లాడుతున్నవాళ్ళు మరికొందరు. నిజానికి దేశంలో సెక్యులరిజాన్ని కాపాడవలసిన బాధ్యత మొత్తం దేశప్రజలది. విద్వేషాన్ని అడ్డుకుంటేనే దేశ ప్రగతీ వికాసాలు సాధ్యం. లేకపోతే ఆర్థిక ప్రగతితో పాటు అంతర్జాతీయ ప్రతిష్ఠ కూడా అడుగంటుతుందన్నది ఇప్పుడు స్పష్టమవుతుంది. కాబట్టి సెక్యులరిజాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిదీ. దేశప్రగతి వికాసాలు కోరుకునే ప్రతిఒక్కరి బాధ్యత ఇది.

అలాగే సోకాల్డ్ సెక్యులర్ పార్టీలు కూడా చేస్తున్నది ముస్లిములను ఓటు బ్యాంకులుగా చూడడం. ఢిల్లీలో ఆప్ చేసింది ఇదే. కొందరు ముస్లిములకు సీట్లు ఇవ్వడం తప్ప ఆప్ ముస్లిములకు చేసిందేమీ లేదు. వివక్ష, హింసకాండ, సామాజిక, ఆర్థిక అణిచి వేతలను అడ్డుకున్నది లేదు. ఏమైనా చర్యలు తీసుకుంటే హిందూ ఓట్లు దూరమవుతాయన్న వైఖరిలోనే ఈ పార్టీలున్నాయి. ఈ వైఖరి సోకాల్డ్ సెక్యులర్ పార్టీలు మార్చుకోకపోతే వాటికి బీజేపీకి తేడా లేదు. బలపడుతున్న మెజారిటేరియన్ రాజకీయా లను అడ్డుకోకపోతే చిన్నా చితక పార్టీల మనుగడే ప్రమాదంలో పడుతుంది. ఇప్పుడు ఆప్ వంటి కాస్త బలమైన పార్టీ మనుగడ కూడా అలాంటి స్థితిలోనే ఉంది. ఢిల్లీ తర్వాత పంజాబ్ కూడా చేజారితే ఆప్ మనుగడ కష్టం. మహారాష్ట్రలో శివసేన పరిస్థితి కూడా ఇలాంటిదే. ప్రాంతీయ పార్టీలు ఒకదాని తర్వాత ఒకటి అంతర్ధానమయ్యే పరిస్థితి రావచ్చు.

బీజేపీని నిలువరించాలని భావిస్తే ఈ పార్టీలు ప్రతిపక్ష ఐక్యత కోసం ప్రయత్నించాలి. కాంగ్రెసుపై ఒత్తిడి తీసుకువచ్చి ఎన్నికల ప్రయోజనాలు సాధించుకుందాం, ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెసును దెబ్బతీసి కేంద్రంలోని పాలకపక్షంతో మంచిగుందాం అనే ఎత్తుగడలను కాంగ్రెసు కూడా ఇప్పుడు తీవ్రంగానే పరిగణిస్తు న్నట్లు కనిపిస్తోంది. ఓటమి భయం ఇప్పుడు కాంగ్రెసుకు పోయిం దని చెప్పాలి. వరుస ఓటముల తర్వాత కాంగ్రెసు ఇప్పుడు ఓడిపోతామన్న భయంతో ఎన్నికల్లో దిగే పరిస్థితి లేదు. ఓటమి ఎలాగూ తప్పనప్పుడు, అనవరసమైన ఒత్తిడితో ప్రతిపక్ష ఐక్యతను దెబ్బతీస్తున్న పార్టీలకు గుణపాఠం చెప్పే వైఖరి కాంగ్రెస్ తీసుకో వచ్చు. ఢిల్లీలో అదే జరిగింది. ఆప్ పార్టీ కనుక కాంగ్రెసుతో చేయి కలిపి ఉన్నట్లయితే ఖచ్చితంగా ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం ఏర్పడి ఉండేది. కాంగ్రెసును అవమానించి, ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెసు ఓటమికి కారణమైన ఆప్ ఇప్పుడు ఓటమికి గురైంది. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహారు రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ ఇదే వ్యూహం అవలంబిస్తే అక్కడి ప్రాంతీయ పార్టీలకు కూడా ఇబ్బందులు తప్పవు. ఈ పరిస్థితిని అఖిలేష్ యాదవ్, నితీష్ కుమార్, మమతా బెనర్జీలు కూడా గుర్తించినట్లే కనిపిస్తుంది. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం పార్టీల్లో పునరాలోచనకు మాత్రమే కాదు దేశ ప్రజల్లో కూడా పునరాలోచనకు కారణమవ్వాలి. ✤

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



ఎప్పుడైతే మానవుడు సాటి మనిషి గురించి ఆలోచించడం, అతని యోగక్షేమాలు పట్టించుకోవడం, సత్సంబంధాలు నెరపడం, సద్భావనతో, సామరస్యంతో మసలుకోవడం, సమాజంలో న్యాయ స్థాపనకై ప్రయత్నించడం మానేశాడో అప్పుడే సమాజం పెడద్రోవ పట్టింది. మానవ హృదయంలో అతి పవిత్రంగా ఉండవలసిన మానవత్వానికి తుప్పు పట్టింది. హృదిలో స్వార్థం పురుడు పోసుకొని ఉన్మాద లక్షణాలు ప్రస్ఫుటమయ్యాయి. తత్ఫలితంగా సమాజంలో అనేక అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. శాంతిభద్రతలు కరువైపోయ్యాయి.

యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్


# సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలి

**ఈనాటి మానవుడు** విద్యా, విజ్ఞానాలు, పదవి, అధికారం, హోదాల పరంగా ఎంత ప్రగతి సాధించినా, నైతిక, సామాజిక, ఆధ్యాత్మికతల పరంగా తిరోగమనంలోనే పయనిస్తున్నాడు. నేడు సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం, సద్భావన, మానవీయ విలువలు అడుగంటి పోతున్నాయి. అశాంతి, అలజడులు, అనుమానం, అభద్రతాభావం తాండవ మాడుతున్నాయి. కులం పేరుతో, మతం పేరుతో ఉన్మాదం పెరుగుతోంది. మనిషిని మనిషి దూషించే, ద్వేషించే స్థాయినుండి ఏకంగా అంతం చేసే వరకు వెళ్ళిపోయింది పరిస్థితి. సంకుచిత మనస్తత్వం, కులతత్వం, మతోన్మాదం, మూకోన్మాదం దేశంలో పెచ్చరిల్లుతోంది. మంచి, మానవత్వం, శాంతీ, ప్రేమ, సదాచారం, సద్భావన మంటకలిసి పోతున్నాయి. నిజానికి మంచి, మానవత్వానికి మించిన ధర్మం మరొకటిలేదు. మానవత్వాన్ని మంటగలుపుతూ, ధర్మాన్ని ఉద్ధరిస్తున్నామని అనుకోవడం కంటే మూర్ఖత్వం మరొకటి ఉండదు. దేవుని పేరుతో దానవత్వం మానవతకు వ్యతిరేకం. భువిపై మానవ ఉనికి మానవత్వాన్ని కాపాడడానికి, సమాజంలో సామరస్యాన్ని, సద్భావనను పెంపొందించడానికి, న్యాయ స్థాపనకని ధర్మం చెబుతోంది. మానవీయ విలువలకోసం పాటుబడే వారికి మంచి ప్రతిఫలం ప్రసాదించే దైవం, శాంతీ, సామరస్యాలకు తూట్లు పొడుస్తూ మానవత్వాన్ని ఖూనీ చేసేవారిని ఊరికే వదిలి పెడతాడా?

ఎప్పుడైతే మానవుడు సాటి మనిషి గురించి ఆలోచించడం, అతని యోగక్షేమాలు పట్టించుకోవడం, సత్సంబంధాలు నెరపడం, సద్భావనతో, సామరస్యంతో మసలుకోవడం, సమాజంలో న్యాయ స్థాపనకై ప్రయత్నించడం మానేశాడో అప్పుడే సమాజం పెడద్రోవ పట్టింది. మానవ హృదయంలో అతి పవిత్రంగా ఉండవలసిన మానవత్వానికి తుప్పు పట్టింది. హృదిలో స్వార్థం పురుడు పోసుకొని ఉన్మాద లక్షణాలు ప్రస్ఫుటమయ్యాయి. తత్ఫలితంగా సమాజంలో అనేక అవలక్ష ణాలు చోటుచేసుకున్నాయి. శాంతిభద్రతలు కరువైపోయ్యాయి. న్యాయం ప్రియమైపోయింది. కులతత్వం పెచ్చరిల్లింది.

మతోన్మాదం పడగవిప్పింది. తీవ్రవాదం, ఉగ్రవాదం జూలువిదిల్చాయి. మతం, మానవతావాదం మంటగలిశాయి. శాంతి, సామరస్యం, సదాచారం, సహజీవనం, సద్భావన, ప్రేమ, మానవీయతలకు విఘాతం కలిగింది. నిజానికి మత విశ్వాసమనేది మానవులు శాంతియుతంగా, సామరస్యంతో, సోదరభావంతో, సద్భావనతో సహజీవనం చేయడానికి దోహదపడాలి. మనుషుల మధ్య విద్వేషాలు సృష్టించడానికి అది సాధనం కాకూడదు. భిన్నత్వంలో ఏకత్వం గల మన దేశంలో సర్వమానవ సహిష్ణుతాభావం, పరస్పర సదవగాహన, సద్భావన జన సామాన్యంలో అంతర్వాహి నిలా ప్రవహించాలి. శాంతి, ప్రేమ, సహనం, సంయమనం, సహజీవనం లాంటి సుగుణాలు జనించాలి. కులాలు మతాలు వేరైనా మానవత రీత్యా మనదంతా పరస్పరం రక్త సంబంధమన్న పచ్చి నిజాన్ని గుర్తించాలి. ఒకరినొకరు, ఒకరి మతాన్నొకరు గౌరవించుకుంటే మనుషుల మధ్య, మనసుల మధ్య దూరాలు, వైరాలు తగ్గి మతసామరస్యం వెల్లివిరుస్తుంది. శాంతి, ప్రేమ, సామరస్యం, సద్భావన, మానవీయత పరిఢవిల్లుతాయి. సామాజిక న్యాయం విరాజిల్లుతుంది. విశ్వమానవ సౌభ్రాతృత్వం ఆవిష్కృతమవుతుంది. సంఘ శ్రేయోభిలాషులు, ఆధ్యాత్మిక పెద్దలు, సామాజిక కార్యకర్తలు, మంచిని, శాంతిని, మానవతను కాంక్షించే ప్రతి ఒక్కరూ ఏకతాటిపై నిలిచి, కలిసి కృషిచేస్తే, సమాజంలో శాంతీ సామరస్యాలను, సోదరభావాన్ని, సద్భావనను పెంపొందించుకోవడం, మానవతను కాపాడుకోవడం, అసంభవం ఏమీకాదు. ఇది ఈనాటి అవసరం. ✤

---




శుభోదయం మొదలు
శుభరాత్రి వరకు
కళ్ళు వత్తులు చేయి
కనబడదు తెలుగు.

మమ్మి డాడీ ముద్దు
వద్దు అమ్మా నాన్న
సోయి దప్పి తెలుగు
సొమ్మసిల్లుత ఉంది.

దేశ భాషల యందు
మన తెలుగు లెస్సంట
చెప్పుకొనుటకు బాగు
చేతలలొ 'లెస్' అంట.

తేనెకన్నా మధురం
మన తెలుగు భాష
ఆదరించకపోతె
పడుతుందిలే గోస.

మాతృభాషా చదువు
అమ్మలాంటీ వరము
శిరముపై పరభాష
సవతమ్మ కరము.

అంత ఆంగ్లంబేన
ఏది మరి నీయాస
నీ మాతృ భాషపై
లేదెందుకో ధ్యాస.

భాష రక్షణలోనె
జాతి రక్షణ ఉంది
భాష మరచిన జాతి
జగతిలో మిగలదు.

చిత్తశుద్ధియు లేక
సభలెన్ని జరిపినా
లాభ మేమున్నదీ
ఫలితంబు మరి లేక.

అందుకే అందరూ
ప్రతిన బూనాలే
మాటల్లొ గాకుండ
చేతలలొ జూపాలే.

తెలుగు వెలుగును పెంచి
తరతరాలకు పంచి
మనభాష ఘనకీర్తి
శిఖరాన నిలపాలె.!! ✤

# ఇస్లామ్‌లో ఆధ్యాత్మిక వ్యవస్థ

- డాక్టర్ సాజిద్ అబ్బాసీ

♦ **ఆత్మప్రక్షాళనతో పాటు ఆధ్యాత్మిక పురోభివృద్ధికి హజ్రత్ ముహమ్మద్ (స) అస్తిత్వంలో గొప్ప ఆదర్శం**

♦ **ఆధ్యాత్మిక వికాసానికి ధార్మిక విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలి**

♦ **నఫిల్ ఆరాధనలతో ఎహ్‌సాన్ స్థాయికి చేరుకోండి**

**గత సంచిక తరువాయి...**

అల్లాహ్, ప్రవక్త మూసా (అలైహి)కి ప్రవక్త పదవి అప్పజెబుతూ.. అల్లాహ్‌తో సంబంధం కోసం నమాజును స్థాపించమని చెప్పాడు. నమాజును విడిచిపెడితే అల్లాహ్ సంబంధం తెగిపోతుంది. అతడు ఆధ్యాత్మిక మద్దతును, మానసిక బలాన్ని కోల్పోతాడు. ఆత్మ నిర్జీవమైపోతుంది. అల్లాహ్‌ను స్మరించే వాడు జీవం ఉన్న వాడితో సమానమని.. స్మరించనివాడు బ్రతికున్నా చనిపోయిన వాడితో సమానమని ప్రవక్త (స) అన్నారు (బుఖారి).

ఆధ్యాత్మిక ఎదుగుదలకు మొదటి మెట్టు సృష్టికర్తను తెలుసుకోవడమే. మొదటి అడుగులోనే విజయం సాధించకపోతే, ఆధ్యాత్మిక ప్రయాణమంతా నిష్ఫలమవుతుంది. సృష్టికర్తను తెలుసుకోవటం మనిషి మేధస్సుకు పరీక్ష. దైవాన్ని తెలుసుకునే వాస్తవిక జ్ఞానం తనను తాను తెలుసుకునేలా చేస్తుంది. లేకుంటే, ఒక వ్యక్తి తన జీవిత లక్ష్యాన్ని తెలుసుకోకుండానే ప్రపంచాన్ని వీడిపోవాల్సి వస్తుంది. “అల్లాహ్‌ను మరచిపోయిన వారి మాదిరిగా మీరూ అయిపోకండి. అల్లాహ్‌ను మరచిపోయిన కారణంగా వారు తమను తాము మరచిపోయేలా చేశాడు అల్లాహ్. వారే పరమ అవిధేయుడు” (59:19)

మనిషి భౌతిక ప్రగతి, వికాసం సాధించి కూడా తన ఉనికిని గురించి తెలుసుకోకుండా మరణిస్తే అంతకు మించిన దురదృష్టం మరొకటి ఉండదు. ఈ విశ్వ వ్యవస్థకు ఒక్కడే సృష్టికర్త అని కొందరు నమ్ముతారు. కానీ, ఆయనను తమ ప్రభువుగా అంగీకరించరు. ఈ సృష్టి రహస్యాన్ని తెలుసుకోవడంలో, ఈ ప్రపంచం ఎందుకు సృష్టించబడిందో, మానవ జీవిత లక్ష్యమేమిటో తెలుసుకోవడంలో విఫలమవుతారు. ఈ వాస్తవాన్ని తెలుసుకోవడానికి కేవలం బుద్ధీ జ్ఞానాలే సరిపోవు. ఇందుకోసం దైవం తన ప్రవక్తల ద్వారా పంపిన దైవవాణి జ్ఞానం అవసరం. ప్రభువు గుణగణాలు, శక్తిసామర్థ్యాల గురించి తెలుసుకున్నప్పుడు హృదయం కృతజ్ఞతా భావంతో ఉప్పొంగుతుంది. గుండెలో దైవప్రేమ జనిస్తుంది. ఈ గమ్యాన్ని విశ్వాస మజిలీగా చెప్పుకుంటారు. దైవాభీష్టానికి అనుగుణంగా జీవితాన్ని గడపడమే

ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో తదుపరి గమ్యస్థానం. ఆయన విధేయతలో ఉండటాన్ని ఇస్లామీయ గమ్యంగా చెప్పవచ్చు. ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో మరో రెండు స్థాయిలున్నాయి. ఒకటి.. దైవభీతి, పరోపకారం. జిబ్రయీల్ హదీసులో ఇలా ఉంది : “మీరు అల్లాహ్‌ను చూస్తున్నట్లు నమాజు చేయండి. లేదంటే ఆయన మిమ్మల్ని చూస్తున్నాడు అన్నట్లు నమాజు చేయండి ఇదే ఎహ్సాన్” (బుఖారీ). ఇది చాలా ముఖ్యమైన హదీసు. ఇందులో దైవభీతి లక్ష్యాన్ని సాధించవచ్చు. దైవభీతి భావన మనిషిని ఏకాంతంలోనూ పాపానికి ఒడిగట్టనీయదు. దైవభీతికి మరో మెట్టే ఆధ్యాత్మికత అత్యున్నత స్థాయి. ఇక్కడ అతను అల్లాహ్‌ను చూస్తున్నాడన్న భావన కలుగుతుంది. అల్లాహ్‌ను ఎవరూ చూడలేరు, కానీ అల్లాహ్‌ను మంచి గుణగణాల అద్దంలో చూసుకోవచ్చు. అల్లాహ్ అత్యంత దయామయుడు, సృష్టికర్త, సర్వశక్తివంతుడు, అన్నీ వినేవాడు, అన్నీ చూసేవాడు అని విశ్వాసుల గట్టి నమ్మకం. పరలోకంలో విశ్వాసులకు అల్లాహ్ అస్తిత్వాన్ని చూసే సౌభాగ్యం కలుగుతుంది. దైవభీతి గల దాసుడు కేవలం విధులు మాత్రమే నిర్వర్తించి ఊరుకుండడు, అదనపు ఆరాధనలతో దైవాభీష్టాన్ని, అల్లాహ్ ప్రీతిని పొందడానికి, దైవ ప్రసన్నత కోసం ప్రయత్నిస్తాడు. అల్లాహ్ ఇష్టమే దాసుడి ఇష్టంగా, అల్లాహ్ అయిష్టమే దాసుడి అయిష్టంగా ఉంటాయి. ఇలాంటి వారి గురించి అల్లాహ్ ఇలా ప్రశంసిస్తున్నాడు... “విశ్వాసులు అన్నిటికంటే అధికంగా అల్లాహ్‌నే ప్రేమిస్తారు” (2:165). దైవ దాసుడు ప్రపంచంలో అన్నింటికంటే అల్లాహ్‌నే ఎక్కువగా ప్రేమిస్తాడు. సృష్టికర్తను ప్రాణానికి మిన్నగా ప్రేమిస్తాడు.

కొంతమంది సృష్టికర్త అన్వేషణలో దారితప్పి తమ లాంటి ప్రాణులకే సృష్టికర్త హోదాను కట్టబెడతారు. ఆధ్యాత్మిక ప్రయాణంలో మొదటి గమ్యాన్ని చేరుకోవడంలో ఇదే అతిపెద్ద వైఫల్యం. ఈ విఫల యత్నంలో వాళ్లు స్వీయ నిర్మిత ఆధ్యాత్మికత తోనో, యోగాతోనో, ధ్యానంతోనో సంతృప్తి చెందాలని చూస్తారు. దాంతో వారు నిజమైన ఆధ్యాత్మికతను కోల్పోతారు. నిజమైన ఆధ్యాత్మికతను సాధించడానికి మొదటి అడుగు ఏమిటంటే, సృష్టికర్తను నిజంగా ఉన్నట్లు తెలుసుకోవటం. అల్లాహ్ తన గురించి తాను ఈ కింది విధంగా పరిచయం చేసుకుంటున్నాడు:

“ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు. ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు. అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు. (112:1-4)”

ఈ సూరాలో, అల్లాహ్ సమగ్ర పరిచయం ఉంది. అల్లాహ్ ఒకే ఒక్కడు. ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు. ప్రతి ఒక్కరికీ ఆయన అవసరమే ఉంది కానీ ఆయనకు ఎవరి అవసరమూ లేదు. ఆయనకు సాటి ఎవరూ లేరు. ఆయన కాలాతీతుడు. ఖురాన్‌లో ఆధ్యాత్మిక, హృదయ పరిస్థితులు నిర్వచించబడ్డాయి. ఎవరి హృదయాలు అల్లాహ్ స్మరణతో నిండి ఉంటాయో, ప్రతి సందర్భంలోనూ అల్లాహ్ వైపు మరలి ఉంటాయో, అలాంటి హృదయాలను ‘ఖల్బె మునీబ్’గా అంటారు. “చూడకుండానే కరుణామయుడికి భయపడేవాడు.. ఏకాగ్ర హృదయంతో వచ్చినవాడు” (50:33) అని ఖురాన్ ప్రవచించింది. సురక్షితమైన, శాంతి మార్గంలో ఉన్న హృదయాన్ని ఖల్బె సలీమ్ అంటారు (37:84). సంతృప్తి చెందిన మనస్సును ‘తత్మయిన్నుల్ ఖల్బ్’ అంటారు (సూరా అర్-రాద్ 28). విశ్వాసుల హృదయాలను మార్గదర్శక హృదయాలు అంటారు (సూరయె తగాబూన్ :11). దైవభీతితో వణుకుతున్న హృదయాన్ని కల్బ్-ఎ-వజిలత్ అని పిలుస్తారు (సూరా అల్-మూమినూన్: 60). అల్లాహ్ సంకేతాలను చూసిన తర్వాత కూడా కొందరి నిర్లక్ష్యంగా అబద్ధం చెప్పేవారిని నిర్లక్ష్య హృదయాలు అంటారు (సూరా అల్-అన్బియా). అహంకారం ఉన్నవారి హృదయాలను గర్వించే హృదయాలు అంటారు (సూరత్ అల్-మూమిన్, 35).

**ఆత్మ ప్రక్షాళన విధానం :** పైన చెప్పినట్లుగా తజ్కియా అంటే ఆత్మ శుద్ధి. మనం మన దేహాన్ని, దుస్తులను ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో అదే విధంగా, మన ఆత్మను అపనమ్మకాలు, తప్పుడు విశ్వాసాలు, తప్పుడు ఆరాధనల నుండి శుద్ధి చేసుకోవాలి. ఇనుముకు తుప్పు పట్టినట్లుగా, పాపాల వల్ల హృదయమూ తుప్పు పడుతుంది. దీనికి పరిష్కారాన్ని ప్రవక్త(స) ఇలా సూచించారు... ఖుర్ఆన్ పారాయణం చేయమని(అర్థం చేసుకుంటూ చదవడం), మరణాన్ని గుర్తుంచుకోమని అన్నారు. పాపాలను వదిలించుకోవడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గం పశ్చాత్తాపం చెందడం. నీతిమంతమైన సంఘంతో సహవాసం చేయడం కూడా స్వీయ సంస్కరణకు ఎంతో ఉపయుక్తమవుతుంది. ఎందుకంటే షైతాన్ ఒంటరిగా ఉన్న వ్యక్తిపై సులభంగా దాడి చేస్తాడు.

## స్వర్గాన్ని అల్లాహ్ మానవుల కోసం సృష్టించాడు

ఖురాన్ ప్రకారం బహు దైవారాధన, అవిశ్వాసపు మలినం చాలా తీవ్రమైనవి. వాటితో స్వర్గంలోకి ప్రవేశించడం అసాధ్యం. పశ్చాత్తాపం చెందడం ద్వారా పెద్ద పెద్ద పాపాలు కూడా మన్నించ బడతాయి. ఇస్తిగ్‌ఫార్ చేయడం వల్ల చిన్న చిన్న పాపాలు క్షమించబడతాయి. విశ్వాసం ఉన్నప్పటికీ మన కర్మల పుస్తకంలో

పాపాలు ఎక్కువగా ఉంటే ప్రపంచంలో కష్టాలు అనుభవించిన కారణంగా కొన్ని పాపాలను అల్లాహ్ మన్నిస్తాడు. అప్పటికీ పాపాలు మిగిలి ఉంటే మరణ వేదన, బర్జఖ్ శిక్షను అనుభవించి నందుకు గాను మరిన్ని పాపాలు పరిహారమవుతాయి. అయినప్పటికీ పుణ్యాలు పాపాల కంటే ఎక్కువయితే కొంతకాలం నరక శిక్ష అనుభవించాక, వారిని పాపాల పరిహారం చేసి తిరిగి స్వర్గాన్ని ప్రసాదిస్తాడు అల్లాహ్.

**ఆత్మప్రక్షాళన కోసం దుఆ :** "ఓ అల్లాహ్ నా మనసును దైవభీతిని నింపు. నా మనసును శుద్ధి చేయి. నువ్వు అందరికంటే గొప్పగా శుద్ధి చేసేవాడవు. నువ్వే మాకు సంరక్షకుడవు."

ఆత్మ ప్రక్షాళన కోసం, ఆధ్యాత్మిక ఉన్నతి సాధించేందుకు ముహమ్మద్ ప్రవక్త (స) పవిత్ర జీవితం గొప్ప ఆదర్శనీయం. ప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఒకసారి ప్రవక్తతో "మీ పాపాలన్నీ క్షమించబడినప్పటికీ మీరు తహజ్జుద్ నమాజులో ఎందుకు ఇంతగా కష్టపడుతున్నారు" అని అడిగారు. దానికి ఆయన "ఆయిషా.. నేను నా ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుకో కూడదా?" అన్నారు. మనం ఆధ్యాత్మిక ఉన్నతి సాధించాలంటే ముందు ధార్మిక విధులను చిత్తశుద్ధితో నెరవేర్చాలి. ఆ తర్వాత అదనపు ఆరాధనల ద్వారా 'ఇహ్సాన్' స్థాయికి చేరుకోగలం. దాసుడు తఖ్వా (దైవభీతి) కలిగి ఉండి ధార్మిక విధులను నెరవేరుస్తూ తమ తోటి వారి హక్కులను నెరవేర్చాలి. 'ఎహ్సాన్ అంటే దైవమార్గంలో సదాచరణలను అత్యుత్తమ రీతిలో నిర్వర్తించడంతోపాటు దాసులకు ఇవ్వవలసిన దానికన్నా అధికంగా ఇవ్వటం.

## జమాఅతె ఇస్లామీ హింద్ కడప ఆధ్వర్యంలో మస్జిద్ మరియు రంజాన్ అంశంపై ప్రత్యేక సమావేశం




కడప బెల్లంమండిలోని మదరస-యే-జెహ్రా నందు జమాఅతె ఇస్లామీ హింద్ కడప శాఖ ఆధ్వర్యంలో స్థానిక మస్జిద్ కమిటీ సభ్యుల కొరకు రమజాన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్య అతిధిగా జనాబ్ అతీఖుర్రహ్మాన్ (Deputy Managing Director, Janaseva Co-operative Credit Society Ltd., Vaniyambadi, T.N) గారు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన సమాజ అభివృద్ధిలో మస్జిద్ పాత్రను వివరించారు. మస్జిద్‌లను సమాజ శ్రేయస్సుకై జరిగే సంక్షేమ కార్యక్రమాల కేంద్రంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమం జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్ర ప్రతినిధి మండలి సభ్యులు మౌలానా సయ్యద్ ఇందాదుల్లా హుసేని నిజామీ గారి అధ్యక్షతన జరిగింది. దాదాపు 30 స్థానిక మస్జిద్ కమిటీల సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారని సంస్థ స్థానిక అధ్యక్షులు జనాబ్ జాకీర్ హుసేన్ తెలిపారు.



సల్మాన్ హైదర్

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు ముస్లిం అభ్యర్థుల విజయం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ముస్లిం ఓట్ల విభజన జరిగింది. అయితే, ముస్లిమ్ సామాజికవర్గం గణనీయమైన జనాభా ఉన్న ఏడు నియోజకవర్గాలలో ఆరింటిలో ఆమ్‌ఆద్మీ పార్టీ విజయం సాధించగలిగింది.

నలుగురు ముస్లిం అభ్యర్థులు అసెంబ్లీకి ఎన్నికయారు. బల్లిమారన్ నుండి ఇమ్రాన్ హుస్సేన్, మతియా మహల్ నుండి ఆలే ముహమ్మద్ ఇక్బాల్, ఓఖ్లా నుండి అమానతుల్లా ఖాన్, సీలంపూర్ నుండి చౌదరి జుబేర్ అహ్మద్. అందరూ ఆప్ టిక్కెట్‌పై పోటీచేసి విజయం సాధించారు.

2020లో గణనీయమైన ముస్లిం జనాభా ఉన్న మొత్తం ఏడు స్థానాలను ఆప్ గెలుచుకుంది. ఈసారి అది ముస్తఫాబాద్ మినహా ఆరింటిని గెలుచుకుంది,

ముస్లింలు అధికంగా ఉన్న 11 స్థానాలకు గాను 8 స్థానాల్లో ఆప్ విజయం సాధించింది. ముఖ్యంగా ఆప్ నుండి నలుగురు ముస్లిం అభ్యర్థులు అమానతుల్లా ఖాన్, అలీ ముహమ్మద్ ఇక్బాల్, ఇమ్రాన్ హుస్సేన్, చౌదరి జుబైర్‌లు సునాయాసంగా గెలిచారు.

ఢిల్లీ ఓటర్లలో ముస్లింలు దాదాపు 13% ఉన్నారు. వీరి ఓట్లు దాదాపు 11 అసెంబ్లీ స్థానాల ఫలితాలపై ప్రభావం చూపుతాయి. ముస్లిం ఓటర్ల జనాభా గణనీయంగా ఉన్న 11 సీట్లు ముస్లిం మెజారిటీ నియోజకవర్గాలుగా పరిగణించబడతాయి. వీటిలో ఓఖ్లా, ముస్తఫాబాద్, బల్లిమారన్, సీలంపూర్, మతియా మహల్, చాందినీ చౌక్, సీమాపురి, బాబర్‌పూర్, కరవాల్ నగర్, జంగ్‌పురా, సదర్ బజార్ ఉన్నాయి.

### ముస్లిం-మెజారిటీ నియోజకవర్గాల్లో ఆప్ విజయాలు

ఓఖ్లా నుంచి అమానతుల్లా ఖాన్ 23,639 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

మహ్మద్ ఇక్బాల్ 42,724 ఓట్ల తేడాతో మతియా మహల్‌ను దక్కించుకున్నాడు.

సీలంపూర్‌లో జుబేర్ అహ్మద్ 42,477 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు.

బల్లిమారన్‌లో ఇమ్రాన్ హుస్సేన్ 29,823 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు.

ప్రేర్ణదీప్ సింగ్ సాహ్ని చాందినీచౌక్ నుండి 16,572 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు,

గోపాల్ రాయ్ బాబర్‌పూర్‌లో 18,994 ఓట్ల తేడాతో విజయం సాధించారు

సదర్ బజార్ ఆప్‌కి చెందిన సోమ్‌దత్ 6,307 ఓట్ల తేడాతో గెలిచారు.

వీర్ సింగ్ ధంగన్ సీమాపురిని ఆప్ 10,368 ఓట్ల తేడాతో గెలిచారు.

మూడు ముస్లిం మెజారిటీ స్థానాలను బీజేపీ గెలుచుకుంది.

ముస్తఫాబాద్‌లో బీజేపీ అభ్యర్థి మోహన్‌సింగ్ బిష్త్ 17,578 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ముస్తఫాబాద్‌లో ఆప్, ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్, కాంగ్రెస్‌ల మధ్య ముస్లిం ఓట్ల చీలిక జరిగింది.

జంగ్‌పురాలో బీజేపీ అభ్యర్థి త్రివేంద్ర సింగ్ కేవలం 675 ఓట్ల స్వల్ప తేడాతో గెలుపొందారు.

బీజేపీ అభ్యర్థి కపిల్ మిశ్రా కరావాల్ నగర్‌లో 23,355 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

అసదుద్దీన్ ఒవైసీ పార్టీ ఖాతా తెరవడంలో విఫలమై నిరాశను ఎదుర్కొంది.




**ఇస్లామ్ ధర్మం** భువిపై సత్సమాజ నిర్మాణం జరగాలని కోరుతుంది. ఆ సమాజంలో పొరుగువారు ఒకరినొకరితో స్నేహ సంబంధాలు కలిగి ఉండాలని, ఒకరినొకరు సహాయసహకారాలు అందించు కుంటూ ఉండాలని, ఒకరి కష్టసుఖాలలో మరొకరు పాలు పంచు కుంటూ ఉండాలని, ఒకరినొకరు తోడూనీడగా ఉంటూ సుఖంగా సంతోషంగా జీవించాలని, ఒకరినొకరిలో అధికులని, అల్పులని ఎలాంటి తేడాలు ఉండకూడదని, ఒకరినొకరు గౌరవించు కుంటూ ఉండాలని, ఒకరినొకరి ధనసంపదలను రక్షించుకుంటూ ఉండాలని కోరుతుంది.

ఎన్నో ఒడిదొడుకులను, ఆటంకాలను ఎదుర్కొని 23 ఏళ్ల కాలంలో ఇస్లామ్ ధర్మాన్ని స్థాపించి, సత్సమాజాన్ని నిర్మించారు. ప్రతి రంగంలో ఆయన(స) స్వయంగా ఆచరించి చూపారు. లక్ష్యాన్ని సాధించాలనే తపనతో కష్టపడితే అది తప్పకుండా సాధ్యమయ్యే విషయమని ఘంటాపథంగా తెలియజేశారు.

ఆయన(స) సాధించిన ఈ విజయం వెనుక రహస్యం ప్రేమ. ఆయన(స) ప్రతి మనిషిని ప్రేమించేవారు. ఆయన(స) నరనరాల్లో ప్రేమ జీర్ణించుకుపోయి ఉండేది. కేవలం మనుషులనే కాదు ప్రతి జీవిని ప్రేమించేవారు. ప్రేమపూర్వకంగా మెలిగేవారు. హక్కులన్నింటిని నెరవేర్చేవారు. అంతేకాదు, వెన్నుపోటు పొడిచిన శత్రువులను సైతం ఆయన(స) క్షమించేవారు. వారిని దగ్గరికి తీసుకునేవారు. ఆయన(స) తన పూర్తి జీవితంలో తన కోసం ఎవరితోను ప్రతీకారం తీర్చుకోలేదు. ఆయన(స) అతి ముఖ్యమైన గుణం క్షమించటం.

ఇస్లామ్ ధర్మాన్ని రూపుమాపటానికి ఆయన(స)తో యుద్ధం చెయ్యటానికి వచ్చిన శత్రువులను ఎదుర్కొనే సమయంలో కూడా తమ అనుచరులకు ప్రత్యేకంగా ఇలా హితబోధ చేసేవారు. “ఎవరిపైననూ అనవసరంగా చేయి ఎత్తకూడదు. పసిపిల్లలను, స్త్రీలను ముట్టకూడదు. అంతేకాదు, పచ్చని పొలాలను, చెట్లను నాశనం చెయ్యకూడదు” అని.

యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను ఉంచటానికి ఆనాడు చెరసాలలు ఉండేవి కావు. వారిని తమ అనుచరులతో ఇండ్లల్లో వారి అధీనంలో ఉంచేవారు. ఇంకా వారి పట్ల సత్ప్రవర్తనను కలిగి ఉండాలని తమ అనుచరులకు బోధించేవారు. ఒకసారి యమామ సర్దారు అయిన షమాను బిన్ అసాల్ యుద్ధ ఖైదీగా పట్టుబడి వచ్చినప్పుడు దైవప్రవక్త ముహమ్మద్(స) గారి అధీనంలో ఉన్నాడు. ఆయన(స) అతనికి గౌరవంగా మంచి భోజనాన్ని ఏర్పాటు చేశారు. త్రాగటానికి పాలను కూడా ఏర్పాటుచేశారు. మూడు దినాల తరువాత అతన్ని విడుదల చేసినప్పుడు దైవప్రవక్త(స) అతనికిచ్చిన గౌరవ మర్యాదలతో అతను ఎంతో ప్రభావితమయ్యాడు. వెంటనే కలిమా పఠించి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించాడు. ఆ తరువాత ఆయన ఇలా అన్నారు : ఓ దైవ

ప్రవక్తా(స)! ఇంతకుముందు మొత్తం భూమి మీద మీ ముఖం కంటే ఎవరి ముఖమూ నా దృష్టిలో అసహ్యకరమైనదిగా ఉండేది కాదు. కాని ఈనాటి నుంచి మీ పవిత్ర ముఖం కంటే ప్రియమైనది నాకు మరెవరిదీ లేదు. నిజంగా చెబుతున్నాను; మీ ధర్మంతో ఉన్న శత్రుత్వం మరే ధర్మంతో ఉండేది కాదు. కాని ఇప్పుడు నా దృష్టిలో మీ ధర్మంకంటే ప్రియమైనది మరే ధర్మం లేదు. సత్యంగా చెబుతున్నాను. మీ నగరం కంటే అయిష్టత మరే నగరంతో ఉండేది కాదు. కాని ఈనాడు మీ నగరం కంటే ప్రియమైనది నా దృష్టిలో మరేదీ లేదు. దైవప్రవక్త(స) శత్రువులను కూడా ఈవిధంగా గౌరవించేవారు. చివరకు కర్కశ హృదయులైన శత్రువులు సైతం ప్రాణస్నేహితులైపోయేవారు. ఈ విధంగా మార్గదర్శకత్వాన్ని ఆచరణాత్మకంగా చూపించిన ప్రవక్త ఆయన.

కనుక ఇస్లామ్ కోరేదేమిటంటే, మీరుగనక విశ్వాసులైతే దైవ ప్రవక్త(స)ను అత్యధికంగా ప్రేమించాలి. ఇహపరలోకాల సాఫల్యాన్ని గనక కోరుకున్నట్లయితే అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త(స)ను అన్నిటికంటే అధికంగా ప్రేమించాలి. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; "మీలో ఎవరైనా సరే మీ తండ్రి కంటే, మీ సంతానం కంటే, మానవులందరి కంటే అధికంగా నన్ను ప్రేమించ నంతవరకు మీరు విశ్వాసులు కాలేరు". (బుఖారీ)

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా చెప్పు : మీకు నిజంగా అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు. అనన్యంగా కరుణించేవాడు. వారితో ఇంకా "అల్లాహ్‌కు, ప్రవక్తకూ విధేయత చూపండి" అని అను. ఒకవేళ వారు నీ ఈ సందేశాన్ని స్వీకరించకపోతే అల్లాహ్ తనకూ, తన ప్రవక్తకూ విధేయత చూపటానికి నిరాకరించినవారిని ప్రేమించటం అనేది నిశ్చయంగా జరగదు. (3: 31,32)


సాధారణంగా ఎవరితో అధికంగా కలవటం జరుగుతూ ఉంటుందో అతనితో సంబంధం బలపడుతూ ఉంటుంది. క్రమ క్రమంగా అతని కోసం హృదయంలో గౌరవం, ప్రేమ పుట్టు కొస్తుంది. ఇది మానవులతోనేకాదు, జంతువులతో, ప్రదేశాలతో ఇతర వస్తువులతో కూడా సంబంధం ఏర్పడుతుంది. ఇస్లామ్ ధర్మం వీటికి వ్యతిరేకం ఎంతమాత్రమూ కాదు. ఇస్లామ్ ధర్మం వాటికి కూడా ఒక స్థానాన్ని కల్పిస్తుంది. కాని వీటన్నింటికంటే అత్యధికంగా అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను ప్రేమించమంటుంది. ఎందుకంటే దీనిద్వారా అతనికి జీవితం గడపటానికి సరైన మార్గదర్శకత్వం లభిస్తుంది. అతనికి సాఫల్యం ప్రాప్తిస్తుంది. ఒకవేళ మనిషి ఇహలోకపు వస్తువుల ప్రేమలో పడిపోయినట్లయితే, మనుషుల ప్రేమకు లొంగిపోయినట్లయితే అతను అల్లాహ్ ఆజ్ఞలకు లోబడి ఉండలేడు. దైవప్రవక్త(స) గారి మార్గదర్శ కత్వంపై జీవించలేడు. అశ్రద్ధకు గురవుతాడు. కోరికలకు దాసోహమైపోతాడు. చివరకు తన ఇహపరలోకాలను నష్టపరచు కుంటాడు.

ఈ విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు; ఓ ప్రవక్తా ఇలా అను; ఒకవేళ మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ బంధువులు, మీ ఆప్తులు, మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు మందగిస్తాయేమో అని మీరు భయపడే మీ వ్యాపారాలు, మీరు ఇష్టపడే మీ గృహాలు అల్లాహ్ కంటే, ఆయన ప్రవక్త కంటే ఆయన మార్గంలో శ్రమించటం కంటే మీకుగనక ఎక్కువ ప్రియతరమైతే, అల్లాహ్ తన తీర్పును మీ ముందుకు తీసుకువచ్చే వరకు నిరీక్షించండి. అల్లాహ్ దోషులకు మార్గం చూపడు. (9: 24)

మనిషి జీవించి ఉన్నంతకాలం అతనికి అతని అవసరాల కోసం ధనం అత్యంతావసరం. ఈ అవసరమే అతనికి ధనం సంపాదించ టాన్ని ప్రోత్సహిస్తుంది. ఇస్లామ్ ధర్మం కూడా ఇతరుల ముందు చెయ్యిచాచకుండా కష్టపడి సంపాదించి తన అవసరాలను పూర్తి చేసుకోమని ఆజ్ఞాపిస్తుంది. దానికోసం ధర్మమార్గాలేమిటో, అధర్మ మార్గాలేమిటో కూడా వివరంగా తెలియజేస్తుంది. అయితే ధన ప్రేమకు దాసోహం కాకూడదని, తప్పుడు మార్గాలు అనుసరించ కూడదని బోధిస్తుంది.

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; స్త్రీలూ, సంతానమూ, వెండి, బంగారు రాసులూ, మేలుజాతి గుర్రాలూ, పశువులూ, సేద్యపు భూములు వంటి వ్యామోహాలపై ప్రేమ ఆకర్షకంగా చేయబడింది. కాని ఇవన్నీ అనిత్యమైన ఐహిక జీవన సంపదలు మాత్రమే. అసలైన ఉత్తమ నివాసం అల్లాహ్ వద్ద ఉన్నదే. ఇలా చెప్పు; వాటికంటే ప్రశస్తమైనదేదో నేను మీకు తెలిపేదా? భయభక్తులు కలవారి కొరకు వారి ప్రభువు వద్ద ఉద్యాన వనాలు ఉన్నాయి. వాటి క్రిందుగా కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారికి శాశ్వతమైన జీవితం లభిస్తుంది. పరిశుద్ధ చరితలైన భార్యల సాంగత్యం లభిస్తుంది. అల్లాహ్ సమ్మతి లభిస్తుంది. అల్లాహ్ తన దాసుల నడవడికను శ్రద్ధతో గమనిస్తాడు. వారు అల్లాహ్‌ను ఇలా వేడుకుంటారు; "ప్రభూ! మేము విశ్వసించాము. మా తప్పులను మన్నించు. మమ్మల్ని నరక జ్వాలల నుండి కాపాడు". వారు సహన శీలురు, సత్యసంధులు, విధేయులు, దానపరులు, క్షమించు అని రాత్రి చివరి గడియలలో అల్లాహ్‌ను వేడుకుంటారు (3: 14-17) మనిషి ఈ వాక్యాలకనుగుణంగా ఆచరించి దైవప్రవక్త(స) గారి జీవితాన్ని అనుసరించి మధ్యస్త మార్గాన్ని అవలంబించి నట్లయితే అతను భూమిపై ప్రశాంతతను నెలకొల్పగలుగుతాడు.

రిపోర్టు : ఇమాద్



# బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి

## 2025-26 ఆర్థిక సంవత్సరానికి విద్య, యువజన సంక్షేమ బడ్జెట్ సిఫార్సులపై ఎస్ఐఓ తెలంగాణ పుస్తకం

**విద్యా, యువజన సంక్షేమ రంగాల్లో బడ్జెట్ కేటాయింపులపై సిఫార్సులు చేస్తూ స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (SIO) తెలంగాణ ప్రత్యేక పుస్తకాన్ని విడుదల చేసింది.** హైదరాబాద్ ఛత్తాబజార్‌లోని ఇస్లామిక్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ పుస్తకావిష్కరణ జరిగింది. విద్యా వ్యవస్థలోని మౌలిక వసతుల లోపాలు, ప్రవేశసాధ్యత, యువత అభివృద్ధి సంబంధిత సమస్యలను విశ్లేషిస్తూ, ఆలోచనాత్మక, ముందుచూపుతో కూడిన పరిష్కారాలను ఈ చిరు పుస్తకంలో సూచించారు.

### విద్యారంగానికి తక్కువ నిధులు - భవిష్యత్తుపై ప్రభావం

విద్యారంగానికి తగినంత నిధులు కేటాయించకపోవడం వల్ల మౌలిక వసతుల లేమి, బోధన సిబ్బంది కొరత, చదువు మానివేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ASER 2024 నివేదిక ప్రకారం, మూడవ తరగతి నుంచి ఐదవ తరగతి విద్యార్థులలో కేవలం 18% మంది మాత్రమే రెండవ తరగతి స్థాయి పాఠాన్ని చదవగలరు, 49% మంది మాత్రమే ప్రాథమిక గణిత సమీకరణాలను చేయగలరు. పాత పాఠ్య ప్రణాళికలు, ఉపాధి అవకాశాలకు విభిన్నంగా ఉండటంతో విద్య, ఉపాధి మధ్య గల అంతరాన్ని పెంచుతున్నాయి. ఈ పరిస్థితిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాల్సిన అవసరం ఉందని SIO తెలంగాణ ముఖ్యంగా సూచించింది.

### యువజన సంక్షేమంలో అసమతుల్యత

యువత అభివృద్ధికి సరైన విధానాలు లేకపోవడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల లేమి, మానసిక ఆరోగ్య మద్దతు కొరత

వల్ల తెలంగాణలో యువత నిరుద్యోగిత రేటు 16.6 శాతంగా ఉంది, ఇది జాతీయ సగటు 10.2 శాతం కంటే ఎక్కువ. దీన్ని అధిగమించేందుకు నైపుణ్యాభివృద్ధి, మానసిక ఆరోగ్య సంరక్షణ, ఔత్సాహికత (Entrepreneurship) కార్యక్రమాలకు నిధులను పెంచాలని బుక్‌లెట్‌లో స్పష్టంగా సూచించారు.

### డిజిటల్ వసతుల లోటు- విద్యార్థులకు ఇబ్బందులు

కరోనా మహమ్మారి సమయంలో సుమారు 32 శాతం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ విద్యకు అవసరమైన సదుపాయాలు అందలేదు. దీనికి పరిష్కారంగా డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి, ఇంటర్నెట్ సబ్సిడీ, సాంకేతికత ఆధారిత బోధన విధానాలను అమలు చేయాలని SIO తెలంగాణ సిఫార్సు చేసింది.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి..

2024-25లో ఫీజు రీయింబర్స్‌మెంట్ (RTF) కోసం రూ.300 కోట్లు కేటాయించినా, అందులో కేవలం రూ.41.86 కోట్లు మాత్రమే ఖర్చు అయింది. ఇంకా 1.2 లక్షల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. దీని వల్ల విద్యార్థులకు విద్యావ్యవస్థలో కొనసాగేందుకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా తక్కువ వర్గాలకు చెందిన విద్యార్థులకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. అందుకే స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ వంటి నిధులను సమయానికి, పారదర్శకంగా విడుదల చేయాలని SIO తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది.

### ఉన్నత విద్యా రంగానికి తక్షణ చర్య అవసరం

రాష్ట్రంలోని 73 శాతం విశ్వవిద్యాలయ బోధన సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యా ప్రమాణాలు పతనమవుతున్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు తక్షణ నియామక డ్రైవ్ చేపట్టాలని SIO సూచించింది. అంతేకాక, ప్రభుత్వ పాఠశాలల్లో 26 శాతానికి పైగా ఫర్నిచర్ లేకపోవడం, కేవలం 53 శాతం పాఠశాలల్లోనే బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు ఉండటం ఆందోళన కలిగించే అంశాలుగా పేర్కొంది. దీన్ని పరిష్కరించేందుకు "మౌలిక వసతుల పునరుద్ధరణ కార్యక్రమం" చేపట్టాలని సూచించింది.

### విద్యారంగానికి నిధులు పెంచాలి.. ఫరాజ్ అహ్మద్, ఎస్ఐవో తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్..

SIO తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ, "విద్య ఏదైనా సమాజానికి వెన్నెముక. అందుకే విద్య కోసం రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం సిఫార్సు మాత్రమే కాదు, అవసరమైన పెట్టుబడిగా పరిగణించాలి. ఈ నిధుల ద్వారా నైపుణ్యం కలిగిన, ఆలోచనాత్మకతతో కూడిన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించవచ్చు" అని అన్నారు.

### నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత : ఎస్ఐవో తెలంగాణ కార్యదర్శి మహ్మద్ హమ్మాదుద్దీన్

SIO తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ హమ్మాదుద్దీన్ మాట్లాడుతూ, "విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని, విద్య మరియు యువజన సంక్షేమ నిధుల కేటాయింపులు అత్యవసరమైన అవసరాలను ప్రతిబింబించాలి. ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య, సమర్థవంతమైన మౌలిక వసతులు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. SIO తెలంగాణ విడుదల చేసిన ఈ బుక్‌లెట్.. సంవిధాన కర్తలు, పాలకులకు సమగ్రమైన అవగాహన కలిగించి, డేటా ఆధారిత, సమగ్ర, సమతుల్య బడ్జెట్ నిర్ణయాల వైపు మళ్లించేందుకు దోహదపడుతుంది." అని స్పష్టం చేశారు.


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

37 ఆయత్‌లు

# 45. అల్ జాసియ

మక్కా అవతరణ

5–6 ఇంకా రేయింబవళ్ళ వ్యత్యాసంలోనూ, భిన్నత్వంలోనూ, అల్లాహ్ ఆకాశం నుండి అవతరింపజేసే ఉపాధి సామగ్రిలోను, తద్వారానే మృతభూమిని బ్రతికించి లేపుతాడు, మరి పవనాల పరిభ్రమణంలోనూ[7] – అనేక సూచనలున్నాయి, బుద్ధినుపయోగించే జనం కొరకు. ఇవన్నీ అల్లాహ్ సూచనలు, వీటిని మేము నీ సమక్షంలో సరిగ్గా, సవ్యంగా వివరిస్తున్నాము. ఇంతకూ ఇక అల్లాహ్, ఆయన సూచనల తరువాత ఇంకా మరే విషయం కావాలి ఈ జనులు విశ్వసించడానికి.[8]

7. పవనాల పరిభ్రమణం అంటే భావం, విభిన్న కాలాల్లో విభిన్న భూభాగాల్లో, విభిన్నమయిన ఎత్తుల్లో విభిన్న పవనాల చలనం అన్నమాట. వీటివల్ల రుతువుల మార్పులు సంభవిస్తూ ఉంటాయి. భూమిపైన ఒక సువిశాలమయిన వాయు మండలం వ్యాపించి ఉండటం మటుకే గమనార్హమయింది కాదు, సజీవ సృష్టిరాశులకు శ్వాస పీల్చుకోవడానికి కావలసిన మూల పదార్థాలన్నీ అందులో ఉన్నాయి. గాలి వల్ల ఏర్పడిన ఈ 'తేమ' కారణంగానే భూలోక వాసులకు అనేక దివిసీమ విపత్తుల నుండి రక్షణ ప్రాప్తమవుతుంది, అంతేకాదు, దీనితో పాటు గమనార్హమయిన విషయం ఏమిటంటే ఈ వాయువు భూ ఉపరితలాన వాతావరణమంతా నిండి ఉండటమే కాదు అప్పుడప్పుడు విభిన్న విధాలుగా వీచుతూ కూడా ఉంటుంది. ఒకప్పుడు చల్లని వాయువులు వీచుతూ ఉంటే, మరొకప్పుడు వేడిగాడ్పులు వీచుతుంటాయి. ఒక్కోసారి వాయుచలనం ఆగిపోతే, మరొకసారి చలనం సాగుతుంది. ఒక్కోసారి నెమ్మదిగా వీచితే మరొకసారి గాలులు తీవ్రంగా వీచుతాయి. ఇంకొకసారి తుఫానులు, గాలి దుమారాలు రేగుతాయి, ఒక్కోసారి పొడిగాలి వీచితే మరొకసారి తేమ నిండిన గాలులు ప్రసరిస్తాయి. ఒక్కోసారి వాన తెచ్చే గాలులు వీస్తే మరొక్కసారి వానను ఎగురేసుకుపోయే గాలులు వీస్తాయి. ఈ రకరకాల గాలులు ఇట్టే గుడ్డిగా వీయవు. వాటికి ఒక నియమం, ఒక వ్యవస్థ ఉంది. ఈ ఏర్పాట్లు పరిపూర్ణ విజ్ఞతతో కూడుకున్నవని ఈ వ్యవస్థ సాక్ష్యం పలుకుతోంది. దీనిద్వారా ఎంతో ముఖ్య మయిన లక్ష్యాలు నెరవేరుతున్నాయి. దీని ప్రగాఢ సంబంధం భూమీ సూర్యుని మధ్య మారే పరిస్థితుల కనుగుణంగా పెరుగుతూ తరుగుతూ ఉండే వేడిమీ శీతలాలతోనూ ఉంది. అంతేకాక దీని గట్టి సంబంధం రుతు పరమయిన మార్పులతో, వర్షాల విభజనతో కూడా ఉంది. ఈ విషయాలన్నీ ఎలుగెత్తి చాటుతున్నాయి, ఏదో గుడ్డి ప్రకృతి యాదృచ్ఛికంగా ఈ ఏర్పాట్లన్నీ చేయలేదు. లేదా సూర్యుడు, భూమి, నీరు, గాలి, చెట్లు, జంతువులు వీటికి వేర్వేరు నిర్వహణ కర్తలూ లేరు, ఒకే దైవం వీటన్నింటికి సృష్టికర్త, ఆయన విజ్ఞతే ఒక మహత్తర లక్ష్యాన్ని సాధించేందుకు ఈ ఏర్పాట్లు చేసింది. ఆయన సృష్టి సామర్థ్యం మూలంగానే ఇదంతా పూర్ణ క్రమబద్ధతతో ఒక నిర్దిష్ట నియమానుసారం కొనసాగుతోంది.

8. అంటే, అల్లాహ్ అస్తిత్వం, ఆయన ఏకత్వం విషయంలో అల్లాహ్ స్వయంగా వివరించిన ఆధారాలు ముందుకు వచ్చిన తరువాత కూడా ఈ జనులు విశ్వసించకపోతే, వీరికి విశ్వాస భాగ్యం ప్రాప్తమవ్వడానికి ఇక ఏ విషయం ముందుకు రావాలి. అల్లాహ్ వచనమయితే, ఒక వ్యక్తి ఈ మహాభాగ్యాన్ని పొందేందుకు వీలున్న అంతిమ సాధనం. ఒక అగోచర యదార్థాన్ని గురించి విశ్వాసం కలగజేయడానికి సాధ్యమయ్యే సమంజసమయిన ఆధారాలన్నీ ఈ పరిశుద్ధ వచనంలోనే పొందుపరచడం జరిగింది. ఆ తరువాత కూడా ఎవరయినా నిరాకరించడానికే నిర్ణయించుకుంటే నిరాకరించవచ్చు. అతని తిరస్కారం వల్ల వాస్తవికత అయితే మారిపోదే.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

**సహీహ్ బుఖారీ** (6వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ الْمَغَازِيْ

**4. యుద్ధాల ప్రకరణం -2**
**(కితాబుల్ మగాజీ)**

# అవ్‌తాస్ యుద్ధం గురించి[1]

## అధ్యాయం : 56

**188)** అబూ మూసా అష్అరీ(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) హునైన్ యుద్ధం నుండి తీరిక లభించిన తరువాత అబూ ఆమిర్(రజి) నాయకత్వంలో ఒక సైనిక దళాన్ని అవ్‌తాస్ లోయ వైపునకు పంపారు. ఈ పోరాటంలో దురైద్ బిన్ సుమ్మాతో ముఖాముఖీ అయింది. అతను వధించబడ్డాడు. అతని సైన్యం కూడా ఓటమి పాలయింది. అబూ మూసా అష్అరీ(రజి) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (స) అబూ ఆమిర్‌తోపాటు నన్ను కూడా (అవ్‌తాస్‌కు) పంపించారు. అబూ ఆమిర్ (రజి) మోకాలికి బాణం గుచ్చుకుంది. బనీ జూషమ్‌కు చెందిన ఒక వ్యక్తి ఆయనపై బాణం సంధించాడు. నేను ఆయన గారి దగ్గరకు వెళ్ళి, "బాబాయి! ఈ బాణాన్ని మీపై వదలినవాడెవడు?" అని అడిగాను. 'అడుగో! ఆ జూషమీ నా హంతకుడు. అతడే నాపైన బాణాన్ని ఎక్కుపెట్టాడ'ని అతని వైపు సంజ్ఞ చేశారాయన. నేను అతనివైపు పరుగెత్తాను. అతన్ని సమీపించాను. కాని అతను నన్ను చూడగానే వేగంగా పరుగెత్తాడు. నేనతన్ని వెంబడించాను. "పిరికిపందా! నీకు సిగ్గులేదా?" అని రెచ్చగొట్టాను. చివరకు అతను ఆగిపోయాడు. మేము పరస్పరం కత్తులు దూసుకున్నాము. కడకు నేనతన్ని వధించాను. తరువాత అబూ ఆమిర్(రజి) దగ్గరకు వెళ్ళి, "అల్లాహ్ మీ హంతకుణ్ణి చంపించాడ"ని అన్నాను. దానికి ఆయన: 'ముందు నా మోకాలి నుండి ఈ బాణాన్ని వెలికి తియ్యి. దీని నుండి పస కారుతోంది' అన్నారు. తరువాత ఆయన, 'నా భ్రాతృజుడా! దైవప్రవక్త(స)కు నా సలామ్ చెప్పు. నా మన్నింపు కొరకు ప్రార్థించమని చెప్పు' అని కోరారు.

తరువాత ఆయన నన్ను సైనికదళంపై తాత్కాలిక అధిపతిగా నియమించారు. ఆ తరువాత ఆయన కొద్దిసేపటికే తనువు చాలించారు (అమరగతి నొందారు). నేను ఆ ప్రయాణం నుండి తిరిగి వచ్చిన మీదట దైవప్రవక్త(స) సేవలో హాజరయ్యాను. ఆయన తన ఇంట్లో ఓ నులక మంచంపై కూర్చుని ఉన్నారు. దానిపై పడక, దుప్పటి లాంటిదేదీ లేదు. ఆయన(స) వీపుపై ఆ నులక మంచం (నార) గుర్తులు స్పష్టంగా కనిపించాయి.[1] నేను ఆయన(స)కు నా గురించి, మా బాబాయి గురించి జరిగినదంతా విడమరచి చెప్పాను. తన మన్నింపునకై ప్రార్థించమని ఆయన ప్రత్యేకంగా కోరారని కూడా దైవప్రవక్త(స)కు విన్నవించుకున్నాను. అప్పుడాయన(స) నీరు తెమ్మని కోరారు. వుజూచేసి, చేతులెత్తి "దేవా! ఉబైద్ అబూ ఆమిర్‌ను మన్నించు" అని ప్రార్థించారు. ఆ సమయంలో నేను ఆయన(స) చంకలలోని తెల్లదనాన్ని చూశాను. 'నా కొరకు కూడా అల్లాహ్‌ను ప్రార్థించండి' అని నేను అభ్యర్థించాను. దానికి ఆయన(స), "అల్లాహ్! అబ్దుల్లాహ్ బిన్ ఖైస్ పాపాలను కూడా క్షమించు. ప్రళయదినాన అతనికి మంచి స్థానం ప్రసాదించు" అని ప్రార్థించారు. అబూ బుర్దా ఇలా అన్నారు: 'ఒక దుఆ అబూ ఆమిర్(రజి) కొరకు, మరొక దుఆ అబూ మూసా(రజి) కొరకు చేయటం జరిగింది.

56-1. హవాజిన్ తెగవారు నివసించే ప్రదేశంలోని ఒక లోయ పేరు 'అవ్‌తాస్'. హునైన్ యుద్ధం తరువాత అవ్‌తాస్‌లో ఒక చిన్న యుద్ధం జరిగింది. ఎందుకంటే హవాజిన్ తెగకు చెందిన కొంతమంది హునైన్ యుద్ధ సందర్భంగా అవ్‌తాస్‌కు పారిపోయారు. అందుచేత దైవప్రవక్త(స) ఒక సైనిక దళాన్ని అక్కడికి పంపిస్తూ అబూ ఆమిర్ అష్అరీ(రజి)ని దానికి అధిపతిగా నియమించారు. 'తాయఫ్' వైపునకు దైవప్రవక్త(స) స్వయంగా వెళ్లారు.

188-1. సుబ్‌హానల్లాహ్! ఒక సువిశాల భూభాగానికి రాజ్యాధిపతిగా, మార్గబోధకునిగా ఉన్న వ్యక్తి నిరాడంబర జీవితానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కాగలదు? విశ్రాంతి తీసుకోవడానికి కేవలం ఒక నులక మంచం. దానిపైన ఒక దుప్పటి కూడా లేదు.

# ప్రత్యామ్నాయ అన్వేషణ



అనువాదం - కె.ఎం.ఎ. సుబ్‌హాన్

**(సయ్యద్ సాదతుల్లా హుసైనీ పుస్తకం "ఇఖామతె దీన్ కీ షాహ్‌రాహ్" నుంచి....)**

అంతులేని భౌతిక విశృంఖలత్వం హద్దులు దాటిన వినిమయ తత్వం, వడ్డీ, వడ్డీ పునాదులపై రుణ వ్యవస్థ, మొత్తం జీవిత రంగాలన్నింటినీ పతనపు అంచులకు చేర్చివేసింది. ఈ స్థితిని యూరప్‌తోపాటు అమెరికా పౌరులు కూడా గత ఏడు, ఎనిమిది సంవత్సరాలుగా అనుభవించారు, గమనించారు కూడా. ఇప్పుడు వారు ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థను కోరుకుంటున్నారు. దాని అన్వేషణకు పూనుకున్నారు. పశ్చిమ దేశాల పెద్ద పెద్ద ఆర్థిక నిపుణులు సైతం నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టిస్తున్న విధ్వంసాన్ని విమర్శిస్తున్నారు. అది మానవ సమాజానికి చేసిన, చేస్తున్న నష్టాలను వివరిస్తున్నారు. తమ రచనల్లో స్పష్టం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థ కోసం పరిశోధనలు చేస్తున్నారు. గత బ్రిటన్ ప్రధాని గార్డన్‌బ్రౌన్ మాటల్లో చెప్పాలంటే "ఇప్పుడు మనకు A New Bretton Woods అవసరం ఎంతైనా ఉంది" (Financial Crisis, Gordo in Brown Calls for 'New Bretton Woods' the Telegraph - 13, 2008).

కుటుంబం, కుటుంబ విలువల విధ్వంసపు రోగం, పాశ్చాత్య ప్రపంచం నుండి బయలుదేరి ఇప్పుడు మొత్తం తూర్పు ప్రపంచానికి అంటుకుంది. ఇప్పుడు కేవలం ఈ రోగం నుండి ముస్లిం ప్రపంచం మాత్రమే తప్పించుకొని నిలిచి వుంది. మరోవైపున కుటుంబం, దాని విలువలు స్థిరంగా ఉన్నప్పుడే వ్యక్తి సమాజం రెండు కూడా ఉన్నతంగా తీర్చిదిద్దబడతాయనే నిజభావన క్రమంగా బలం పుంజుకుంటుంది. కుటుంబం బలంగా ఉంటేనే మనిషి, శాంతి, శుభ సంక్షేమాలతో జీవించగలడని నేడు ప్రపంచం విశ్వసించే స్థాయికి ఎదిగింది. ఇప్పుడు అమెరికా ఆస్ట్రేలియాలలో సైతం కుటుంబం, దాని విలువల ప్రచారం ఎలక్షన్ క్యాంపెయిన్‌లో సైతం భాగమయ్యింది. ఆస్ట్రేలియాలో అయితే ఒక రాజకీయ పార్టీయే Party First Family అనే పేరుతో ప్రజలలో పనిచేస్తూ ఉంది. ఈ విధంగా నేటి ప్రపంచం శాంతి అన్వేషణలో, ఉత్తమ ఆర్థిక వ్యవస్థ అన్వేషణలో, దృఢమైన, ఉత్తమ విలువలు గల కుటుంబ వ్యవస్థ అన్వేషణలో, ధార్మిక విలువలు, మరీ ప్రత్యేకించి ఇస్లామీయ ధార్మిక జీవన వ్యవస్థ వైపుకు పరుగులు పెడుతూ ఉంది. కనుక పాశ్చాత్యపాలసీ తయారీదారులు ఇస్లాంలోని ఈ ప్రత్యేకతల కారణంగా, దృఢమైన విశ్వాసం, ఉన్నతమైన విలువల మూలంగా, బలమైన కుటుంబ వ్యవస్థ వల్ల, విశాలమైన భావనలతో మొత్తం పాశ్చాత్య ప్రపంచాన్ని, దాని తాత్వికతను ఓడించగలదని భీతిల్లుతున్నారు.

పాశ్చాత్య ప్రపంచం తన వ్యవస్థ పట్ల అత్యంత అసహనానికి గురై ఉంది. థామస్ ఫ్రాయిడ్ మెన్ లాంటి అమెరికా సాంస్కృతిక వ్యవస్థకు లాయర్ వంటి మేధావి కూడా ఈ క్రింది పాటను పాడుతున్నాడు. ఈ పాట నేడు అమెరికా జాతీయగీతం స్థాయికి చేరుకుంది.

I was going where I should not go.... Seeing who I should not see...

Doing what I should not do... And being what I should not be....

I used to think that I was strong, But lately I just lost the fight.

(That used to be US. Little brown London, 2011 pages - 240-241 by Thomas Fredman & Michael Mandelbaum)

ఈ పరిస్థితిలో ఇస్లామీయ ప్రపంచం ఏ పాట ఆలపిస్తుంది?

మాకు సైనికపాలనా వద్దు! మాకు నియంతృత్వమూ వద్దు ! మాకు సెక్యులరిజం, ప్రజాస్వామ్యాలూ వద్దు!

మాకు-గౌరవం. మానమర్యాదలు, మానవత్వం కావాలి! ఈజిప్టు దేశపు ఇస్లామీయ నాగరికత కావాలి!

ఈ నినాదాలు మొరాకో మరియు ట్యునీషియాలోని ప్రశాంతమైన బజార్లు, నివాస ప్రాంతాలలోనే కాదు, ఈజిప్టు కారాగారాల లోనూ, సిరియా భవనాలలోనూ, ఈ నినాదాలు ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ ఆలపించబడుతూ ఉన్నాయి. వ్యత్యాసం చాలా స్పష్టంగా కనపడుతుంది. ఒకవైపున థామస్ ఫ్రాడ్‌మెన్ నిస్సహాయ విలాపం ఉండగా, మరో వైపున ఉత్సాహంతో, ఆత్మ విశ్వాసంతో తొణికిసలాడే భవిష్యత్ గీతాలాపన వినిపిస్తుంది. ఇదే అసలైన వ్యత్యాసం! పాశ్చాత్య సంస్కృతికి - ఇస్లామీయ సంస్కృతికి మధ్యగల అసలైన వ్యత్యాసం ఇదే! పాశ్చాత్య ప్రపంచం తననుండి, తన వ్యవస్థ నుండి, తన విలువల నుండి, విసిగిపోయిన దృశ్యం ఒకవైపున ఉంది. మరోవైపున ఇస్లామీయ జగత్తు పూర్తి శక్తి, ఉత్సాహాలతో, సంపూర్ణ విశ్వాసంతో ఉరకలెత్తుతూ ఉంది. ప్రపంచం మొత్తంలో ఇస్లాం, ఇస్లామీయ వ్యవస్థ, ఇస్లామీయ విలువలపట్ల ముస్లింల సంతృప్తి మరింత అధికమయ్యింది. ఈ విషయంగా అనేక సర్వే రిపోర్టులు మనకు అందుబాటులో ఉన్నాయి. వాటి ప్రస్తావన ఇక్కడ అప్రస్తుతమని భావిస్తాను.

ఇస్లాంతో ధృడమైన విశ్వాసం కలవారు ఒకవైపున ప్రాపంచిక అభివృద్ధిని కూడా సాధిస్తున్నారు. శాస్త్రీయ పరిశోధనా రంగంలో నేడు ఈరాన్ అత్యంత అభివృద్ధి సాధించి ప్రథమస్థానంలో ఉంది. (Iran is the Top of the world in Science growth ; New Scientist, By Andy Coghain) ప్రస్తుత టర్కీ AKP పాలనలో ఉన్నతమైన పరిశోధనా స్థాయికి ఎదిగింది. దాని పరిశోధనా పత్రాలు, వ్యాసాలు ఉన్నత ప్రమాణాలు కలిగి ఉన్నాయి. ఇప్పుడు టర్కీ అంతర్జాతీయంగా ఒక శాస్త్ర సాంకేతిక రంగంలో ఉన్నతమైన, అభివృద్ధి సాధించిన దేశంగా పిలవబడుతూ ఉంది. (Turkeys Scientifc reasearch output is booming but, What about the quality, retrieved on 5 Dec- 2016) ఇక మహిళల్లో పరిశోధనా జిజ్ఞాస, జ్ఞాన సముపార్జనాభిలాషల విషయంగా టర్కీ, యూరప్ మొత్తంలో ప్రథమస్థానం పొంది ఉంది. అంటే శాస్త్ర సాంకేతికరంగ పరిశోధనలో నిమగ్నమై ఉన్నవారిలో మహిళల శాతం కూడా టర్కీలో గణనీయంగా ఉండటం విశేషం. (క్రైస్తవ ప్రపంచం బ్రిటన్ కంటె, నాస్తిక ప్రపంచం ఫ్రాన్స్ కంటె ఎంతో ముందంజలో ఉన్నారు) (European Commission, Directorate General of Research and Innovation Report - She Figures 2015, Gender is Research and Innovation - Page 65) ప్రస్తుతం రానున్న కాలంలో ఏ పదకొండు దేశాల ప్రాధాన్యత గురించి, శాస్త్ర సాంకేతికరంగ ప్రపంచం చర్చిస్తుందో అందులో 7 ముస్లిం దేశాలు ఉండటం గమనార్హం. Beyond the Bricks, a look at the Next - 11, Pages 160 - 164 , By Glod man Sachs)

## ఇస్లామోఫోబియా ; ఫలితంగా తయారయ్యే పాలసీలు

పైన పేర్కొన్న కారణాలన్నీ కలిసి 'ఇస్లామోఫోబియా' అనే మానసిక స్థితికి ప్రపంచం నేడు లోనై ఉంది. ఈ మానసికతయే మధ్య ప్రాంతంలో రక్తపాతాలను సృష్టించేందుకు కారణం అయ్యింది. ఇస్లామీయ ఉద్యమాల పట్ల శతృత్వానికి కూడా ఇదే కారణంగా ఉంది. ఇస్లామోఫోబియాకు గురైే రచనలు చేసిన వారి రచనలు చదివి చూడండి. అందులో వారు కొన్ని బాంబు సంఘటనలు, లేక తీవ్రవాద చేష్టలకు భయపడి రాసినట్లుగా ఉండవు. అందులో వారి అసలు భయం ఇస్లాం ప్రత్యామ్నాయ వ్యవస్థగా ప్రజలందరి మన్నలను పొందే శక్తి గలదిగా ఉందనేది స్పష్టంగా తెలుస్తుంది. ఇస్లాంను నిరోధించకపోతే అది మొత్తం పాశ్చాత్య ప్రపంచంలో శీఘ్రగతిన అభివృద్ధి చెంది తీరుతుందని వారు భయపడుతున్నారు. ఉదాహరణకు డేవిడ్ సెల్యూలర్ రచించిన LOSING BATTLE WITH ISLAM గ్రంథంలో రచయిత ఇప్పుడు పాశ్చాత్య ప్రపంచం ఇస్లాంను ఓడించడంలో విఫలమై తీరుతుందనీ అందుకు బలమైన 10 కారణాలను వివరించాడు. (Losing Battle with Islam, Promethens Books, New

york- 2005) ఈ రచయిత అభిప్రాయం ప్రకారం పాశ్చాత్య ప్రపంచం, ఇస్లాంతో చేసే పోరాటంలో ఓడిపోకతప్పదు. ఇంకా ఒక ఫ్రెంచ్ రచయిత Michael Houellebecq తన గ్రంథం Submission లో ఒక దృశ్యాన్ని పాఠకులకు చూపించాడు. అందులో రానున్న దశాబ్దకాలంలోనే ఫ్రాన్స్‌లో ఇస్లామీయ ప్రభుత్వం స్థాపించబడి తీరుతుందని జోస్యం చెప్పాడు. (Submission Kindle Edition ; Cornerstone Digital By Michael Houellebecq Trans by Lorin Stein) పేర్కొనబడిన గ్రంథాలు పాశ్చాత్య ప్రపంచ పాలసీ రచయితల మనోమస్తిష్కాలపై బలమైన ముద్రలను వేశాయి. ఈ మధ్యనే రచయిత డేవిడ్ సెల్‌బూర్న్ తన ఒక వ్యాసంలో తాను అమెరికా హోం కార్యదర్శితో జరిపిన సంభాషణను ఉటంకించాడు. అందులో సదరు అమెరికా కార్యదర్శి తన సంభాషణలో 'పరిస్థితిని ఇలాగే కొనసాగిస్తే మన చరిత్ర ఇస్లామీయ ఖిలాఫత్ కనుసన్నల్లో లిఖించబడుతుందని చెప్పాడట. (The Challenge of Islam ; In the New Stateman, London - 04/2014 by David Selbourne) ఈ భయమే, ఈ అతిపెద్ద శక్తివంతమైన పాశ్చాత్య పాలసీదారులకు, తమ పాలసీలను ఇస్లాంకు వ్యతిరేకంగా తయారు చేసేందుకు ప్రేరేపిస్తుంది. ఈ ఇస్లాం ప్రమాదం నుండి తమ్ము తాము రక్షించుకునేందుకు ఈ అంతర్జాతీయ ఆధిపత్యశక్తులు తమ పాలసీలను రచిస్తు న్నాయి. ఇందుకు స్పష్టమైన నిదర్శనాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

1. ఇస్లాంకు వ్యతిరేకంగా తీవ్రమైన, శక్తివంతమైన ప్రాపగండా అమలు చేయటం తద్వారా మిగిలిన ప్రపంచంలో ఇస్లాం పట్ల తీవ్రమైన వ్యతిరేకత, ద్వేషం పెంపొందించబడాలి.
2. ముస్లింల చేత ఈ ప్రాపగండాను సమర్ధించుకునేందుకు అవసరమైన చర్యలు చేయించాలి. తద్వారా ఇస్లాం ఈ ప్రపంచానికి ఒక శాపం, ఒక నరక ప్రాయమైన వ్యవస్థగా నిరూపించాలి.
3. ఇస్లామీయ ఉద్యమాల నుండి ప్రజలను దూరంగా ఉంచాలి. ప్రజా సహకారం లభించకుండా చేయాలి. లేదా ఇస్లామీయ ఉద్యమాలకు ప్రత్యామ్నాయంగా – పతనాత్మక, విధ్వంసక సంస్థలను స్థాపించి, యువకులు అటువైపు ఆకర్షితులయ్యేలా చేయాలి. లేదా ఈ అగ్నిగుండంలో వారిని బలవంతంగా నెట్టాలి.
4. ముస్లింలను ఇస్లాం నుండి, దాని విలువల నుండి, మరీ ప్రత్యేకించి ప్రియ ప్రవక్త ముహమ్మద్(స) సాంప్రదాయం నుండి దూరంగా నెట్టివేయాలి.
5. ముస్లింలను, ప్రత్యేకించి ఇస్లాం విజయవంతమయ్యే అద్భుత కోరిక గల వారిని విభిన్న సంస్థలు, గ్రూపులలో విభజించి, వారి శక్తిని విడగొట్టడం.
6. ఇస్లామీయ దేశాలలో తమ కీలుబొమ్మ, తాబేదార్ ప్రభుత్వాలు, కీలుబొమ్మ తాబేదార్ సైన్యం, తాబేదార్ / కీలుబొమ్మ రాజ్య వ్యవస్థలకు మద్దతు ఇవ్వడం, వారి ద్వారా తమ లక్ష్యాలను సాధించేందుకు కుట్రలు పన్నడం.

ఈ పాలసీలు రచించబడుతూ వున్న కాలంలోనే 'అరబ్బు వసంతం' మధ్య ప్రాచ్యాన్ని తన మేఘఘర్జనలతో ఉద్రూతలూగిస్తూ ముందుకు వచ్చింది. ఫలితంగా మధ్యప్రాచ్యపు అరబ్బు భూభాగం ఇస్లామీయ ఉద్యమ వాతావరణంలోకి అడుగుబెట్టింది. దాదాపు అరబ్బుదేశాలన్నింటిలోనూ ఇస్లామీయ వ్యవస్థ స్థాపించబడుతుందా! అనే వాతావరణం నెలకొంది. ఈ సమయంలోనే 'దాఇష్' కల్లోలానికి తెరలేపబడింది. తర్జుమానుల్ ఖుర్ఆన్‌లోని ఒక వ్యాసంలో ఇరాక్‌లోని ఇఖ్వానుల్ ముస్లిమీన్ నాయకుని విశ్లేషణ ప్రకారం, ఇరాక్‌లో 'దాఇష్' అసలు ఉద్దేశ్యం. అక్కడి 'ఇఖ్వాన్' సంస్థపై దాడి చేయడం. ఇదే విధంగా సిరియాలో సైతం బషారుల్ అసద్ క్రూర, దౌర్జన్యకర సైన్యం దాడులకన్నా ఎక్కువగా 'దాఇష్' ద్వారా 'ఇఖ్వాన్' సభ్యులు హత్యలకు గురయ్యారు. పాలస్తీనాలో హమాస్ స్థావరాలపై దౌర్జన్యకర సైనిక దాడులు జరుగుతూ ఉన్నాయి. హమాస్ ద్వారా ఇప్పటి వరకు ఇస్రాయీల్ సైన్యాలకు ఎటువంటి నష్టం వాటిల్లిన దాఖలాలు మనకు కనపడవు. *(తర్జుమానుల్ ఖుర్ఆన్ – జనవరి 2015 లాహోర్ – అబ్దుల్ గఫార్ అజీజ్)*



'చరితార్థులు'-2



# వి. యం. ఒబేదుల్లాహ్

## (1905 -1958)

73







9440241727


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**(1905-1958)** ఆంగ్లేయుల దుష్ట చర్యలను ధిక్కరిస్తూ 'సైమన్ గోబ్యాక్ ఉద్యమం'లో పోలీసుల తుపాకి గుండుకు ఎదురుగా గుండె నిలిపిన ధైర్యశాలి వి.యం ఒబేదుల్లాహ్ 1905 మే రెండున తమిళనాడు రాష్ట్రం వెల్లూరులో జన్మించారు. తండ్రి పి. మదార్ బాచా సాహెబ్ దుకాణం వద్దకు తరచుగా వచ్చు జాతీయోద్యమకారుల సంభాషణలతో ప్రేరణ పొందిన ఒబేదుల్లాహ్ 1919 నుండి భారత జాతీయ కాంగ్రెస్ సభ్యునిగా బ్రిటిష్ వ్యతిరేక కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనడం ఆరంభించారు. జాతీయోద్యమ రథసారధులు మహాత్మా గాంధీ, అలీ సోదరులు, అబుల్ కలాం ఆజాద్, ముక్తార్ అహ్మద్ అన్సారి, పండిత జవహర్‌లాల్ నెహ్రూ లాంటి జాతీయ స్థాయి నాయకులు, స్థానిక నేతలు కామరాజ్ నాడర్, కె కుప్పుస్వామి తదితరుల సహచర్యంలో నిబద్ధతగల జాతీయోద్యమకారుడిగా రూపొందారు. మహాత్మా గాంధీ మాటను, బాటను శిరోధార్యంగా స్వీకరించిన ఆయన 'గాంధీ సంఘం' స్థాపించి గాంధేయ సిద్ధాంతాలను ఆచరణాత్మకంగా ప్రచారం చేశారు. జీవితాంతం ఖద్దరు ధరించారు. ఆయన స్వదేశీ, హోంరూల్ ఉద్యమాలతో ఆరంభించి, భారత జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన స్థానిక-జాతీయ స్థాయి బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలన్నిటిలో చురుగ్గా పాల్గొన్నారు. ఆర్కాట్, వెల్లూరు, ప్రాంతాల ప్రజలను తన అనర్గళ ప్రసంగాలతో ప్రేరేపించి జాతీయోద్యమ కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తూ ఆ ఉద్యమ కార్యక్రమాలను తాను ముందుండి నడిపారు. జాతీయోద్యమకారుడిగా అరవై ఎనిమిది మాసాలపాటు వివిధ జైళ్లలో కఠిన కారాగార శిక్షలను అనుభవించారు. అంతే కాకుండా ఆంగ్ల ప్రభుత్వ పోలీసుల దాష్టీకాలకు పలుమార్లు గురయ్యారు. 1930 నాటి సైమన్ కమిషన్ ఉద్యమం సందర్భంగా వెల్లూరులో జరుగుతున్న ఊరేగింపును అడ్డుకున్న పోలీసులు కాల్పులు జరుపుతామని హెచ్చరికలు చేయగా, తన ఒంటి మీదున్న చొక్కాను తీసివేస్తూ గురిపెట్టబడిన తుపాకి కొనకు తన గుండెను చూపుతూ నిర్భయంగా ముందు నిలచిన ఒబేదుల్లాహ్‌ను పోలీసులు అరెస్టు చేసి 18 మాసాల జైలు శిక్ష విధించారు. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో కామరాజ్ నాడర్ అరెస్టు కాగా ఆయన నాయకత్వ బాధ్యతలు చేపట్టి ఉద్యమాన్ని ముందుకు నడిపారు. భారత జాతీయ కాంగ్రెస్ తమిళనాడు శాఖలో బృహత్తర బాధ్యతలను నిర్వహించిన ఒబేదుల్లాహ్ భారత విభజనను వ్యతిరేకిస్తూ ముస్లింలీగ్ నేతలను ఎదుర్కొన్నారు. ప్రజాసేవయే పరమావధిగా భావించిన ఆయనను 20 ఏండ్లపాటు వెల్లూరు పురపాలక సంఘానికి తమ ప్రతినిధిగా ప్రజలు ఎన్నుకున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించాక 1952లో విధానసభ సభ్యునిగా, 1956లో రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించిన వి.యం. ఒబేదుల్లాహ్ 1958 ఫిబ్రవరి 21న చివరిశ్వాస విడిచారు. ✤

3

# ఇస్లామీయ ఉద్యమ లక్ష్యం

# సద్పరివర్తనం

- ఎస్.ఎమ్. మలిక్

### అలక్ష్యానికి పర్యవసానం

ఈ పరివర్తనం లేదా సద్విప్లవం కొత్తదేమీ కాదు, దీన్ని కాంక్షించడమూ వింతయిన విషయం కాదు. ఈ పరివర్తనం వైపునకు జీవన శకటాన్ని మలుపు తిప్పడానికి విశ్వకర్త, ప్రభువు పక్షాన ఎన్నుకోబడిన ఆయన దాసులు ఎప్పుడు అరుదెంచినా ఈ లక్ష్యాన్ని, ఈ కోరికను ప్రకటించారు. వారు మానవాళిని ఈ దారి వైపునకే దర్శకత్వం వహించారు. ఈ విప్లవం ద్వారానే లోగడ కూడా ఇస్లామ్ ప్రపంచానికి సన్మార్గం చూపింది, మానవాళి అత్యున్నత శిఖరాలను అధిరోహించగలిగింది. ఫలితంగా ప్రపంచం సకల విధాలా ప్రగతీ వికాసాలు సాధించింది. ఆ తరువాత జరిగింది విషాదకరం. ముందుకుసాగే ఆనాటి రథం పగ్గాలు అలక్ష్యానికి లోనయిన ముస్లిముల చేతుల నుండి, దైవ ధిక్కారులయిన జనావళి చేతుల్లోకి జారిపోయాయి. ఆపైన ముస్లిములు మేల్కొనేవరకు ప్రపంచం తన శీఘ్రగతి మూలంగా ఎన్నెన్నో మజిలీలు దాటిపోయింది. ఆ తరుణంలో ప్రపంచ పగ్గాలను హస్తగతం చేసుకోవడం ముస్లిముల శక్యం కాని విషయం. జ్ఞానం, ఆచరణల రంగంలో మానవ జీవితం ఎన్నెన్నో దూరాలకు వెళ్ళిపోగా ముస్లిముల లోకం ఎంతో వెనుకబడి పోయింది!

ఆ మీదట ప్రపంచ శకటాన్ని నడపాలంటే జ్ఞాన రంగంలోనూ ఆచరణా వీధుల్లోనూ ముమ్ముందుకే చూడగలిగే వారికే సాధ్యమయ్యే దశ వచ్చేసింది. వారు వర్తమానం ద్వారా సంపూర్ణంగా ప్రయోజనం పొందగలిగేవారయి, భవిష్యత్తులో బహు దూరాల వరకు దృష్టి సారించగలిగే వారయి రూపొంద వలసి వస్తుంది. తమ ఆలోచనా పటిమతో, తమ పరిశోధనా కృషితో, తమ ఆవిష్కరణలతో, తమ మార్గాన్వేషణతో దైవ ధిక్కారాన్ని పునాదితో పెకలించి వేయగలిగేవారు, దైవ ధిక్కార, పైశాచిక భావనల ఆధారంగా నిర్మాణమయిన తళుక్కు తళుక్కు మని మెరిసే ఆకాశ హర్మ్యాల జిలుగులు మానవ దృష్టినీ, ప్రపంచం మొత్తాన్నీ కళ్ళు తెరువనివ్వని పరిస్థితుల్లో దాని గుల్లతనం ప్రస్ఫుటంగా ప్రపంచం సమక్షంలో బట్టబయలు చేయగలిగే వారయిన వారితోనే ఈ పని సాధ్యమవుతుంది. వారు ఇస్లామీయ ఆలోచనా విధానం ద్వారా తమ పరిశోధనల, సిద్ధాంతాల ద్వారా మానవ ఆలోచనా పథాన్ని దైవ ప్రసన్నతా మార్గానికి మలచగలిగేవారయి ఉండాలి. కడకు ఈ ఆలోచనే, ఈ దృష్టియే ప్రపంచమంతటా సర్వసామాన్యమయిపోవాలి. ప్రతి వ్యక్తి దాన్ని తన ఆంతర్య ఘోషగా గ్రహించగలగాలి, ఇంకా మానవ సభ్యతా సంస్కృతులు, జీవన విధానాలు ఇస్లామీయ అంతరాత్మతో శోభిల్లుతూ ఉండాలి. ఇలాంటి వారే నేడు మానవాళికి మార్గదర్శకులు కాగలుగుతారు.

### ఒక ఉపమానం

మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ(రహ్మ) ఓ చోట ఉపమానంగా ఇలా వ్రాశారు: ప్రపంచ రైలుబండిని ఆలోచనల, పరిశోధనల ఇంజను నడిపిస్తుంది. దాని డ్రైవర్లు, ఆలోచనా

పరులు, సిద్ధాంతకర్తలు, పరిశోధకులు. బండి దిశను మార్చదలిస్తే ఇంజనును హస్తగతం చేసుకుని కావలసిన దిశలో దాన్ని మలుపు త్రిప్పాలి. దైవధిక్కారుల నుండి ఈ బండిని కాపాడదలిస్తే కేవలం ఆవేదన చెందడం, చీదరించుకోవటం వల్ల ఏమీ ఒరగదు. దానికి బదులు నిజ దైవ చింతన, దృష్టి గలవారు తమలో ఈ బండిని నడిపించే డ్రైవర్లకు తప్పనిసరి అయిన శక్తిసామర్థ్యాలను తమలో సృజించుకోవలసి ఉంటుంది. ఆ పైనే రైలు బండి ఇంజను పొందడానికీ, దాని దిశ మార్చడానికీ కృషి సలపవలసి ఉంటుంది.

ఈ రైలు బండి ఉపమానాన్ని కాస్త పొడిగించి యోచిస్తే మరి కొన్ని విషయాలు ముందుకు వస్తాయి. రైలుబండిని నడపడానికి కేవలం రైలు పెట్టెలు, ఇంజను, డ్రైవర్లు మాత్రమే ఉంటే సరిపోదు. ఇంకా రైలు పట్టాలు, స్టేషన్లు, స్టేషన్ మాస్టర్లు, రైలు లోపల టికెట్టు చెక్ చేసేవారు, రైలుబండి పర్యవేక్షకుడయిన గార్డు కూడా కావలసి ఉంటుంది. ఇంతేకాక రైలు పట్టాలను కాపాడే, వాటి పర్యవేక్షణ చేసే సిబ్బంది, ఇంకా ఈ వ్యవస్థనంతటినీ నిర్వహించే మేనేజ్‌మెంట్ వ్యవస్థ- ఇవన్నీ రైలు బండి సక్రమంగా సవ్యంగా నడవడానికి అవసరమయినవే. వీటన్నింటి దృష్ట్యా బుద్ధి జ్ఞానాలు కోరేదేమిటంటే, రైలు బండిని దిశ మార్చి సరయిన మార్గాన నడిపించగోరేవారు కేవలం డ్రైవరు సీటును పొందడానికి ప్రయత్నిస్తే సరిపోదు, మిగతా డిపార్ట్‌మెంట్‌లన్నింటినీ గురించి, ప్రతి రంగంలో ఓ క్రమానుగతితో జ్ఞాన సముపార్జన, ఆచరణాత్మకంగా వాటి పనితీరును అర్థం చేసుకుని ఆ విభాగాలన్నింటిపైన అదుపు సాధించే కృషి సలపవలసి ఉంటుంది. ఎందుకంటే ఈ కార్యకలాపాలన్నీ రైలు బండిని నడిపించడానికి అనివార్యమయిన విభాగాలే!

## క్రమానుగతి

ఏదో తాత్కాలిక భావోద్రేక ఉద్వేగంలో, ఇంకా కేవలం 'ఉత్సాహం'తో ఏదో చేసి వెయ్యాలన్న ప్రయత్నం వల్ల 'మార్గదర్శక' స్థానం ప్రాప్తం కాదు. ఆ స్థానం, సుదీర్ఘ, గంభీర, ఆలోచన, పరిశోధన, నిరంతర శిక్షణ వల్లనే ప్రాప్తం కాగలదు. దీనివల్లనే వ్యక్తిగత, సామూహిక వ్యక్తిత్వం ఉజ్వలమవుతుంది. ముందుకు వస్తుంది. దీని ద్వారానే ప్రగతీ వికాసాలు, వ్యక్తిలోనూ, వ్యవస్థలోనూ కొనసాగుతాయి. ఇది అనివార్యమయిన దశ. దీని ద్వారానే కాని దీన్ని కాదని కాదు, ఏ వ్యవస్థనయినా నడపాలంటే మరో తీరులో వీల్లేదు. అలాంటప్పుడు వ్యవస్థను మార్చడం, సత్పరివర్తనం, సద్విప్లవం పట్ల కనీసం యోచించనూ లేము!

పైన నుడివిన విషయాల వల్ల ఒక విషయమయితే స్పష్టమయి పోయి ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా ఒక క్రమపద్ధతిలో జరగాలి. సామాజిక విప్లవం లేదా పరివర్తనంలో క్రమానుగతి అంటే అర్థం ఏమిటి? ప్రస్తుత వ్యవస్థలోని విభిన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో కోరుకున్న పరివర్తనం కలగటానికి, ఏ ఏ విషయాలలో లేదా సంస్థల్లో సందర్భానుసారం జోక్యం కలగజేసుకుని సంస్కరణ సాధ్యమవుతుందో వాటిలో ఇటువంటి కృషి చేస్తూ ఉండాలి. ఉదాహరణకు సరికొత్తగా ఆర్థిక సంబంధమయిన, విద్యాసంబంధమయిన తగిన సంస్థల స్థాపన. మనం నేడు ఈ సత్పరివర్తనను కాంక్షిస్తున్న మన దేశం స్వయాన క్రమవికాస కాలం ద్వారా పురోగమిస్తోంది. ప్రస్తుతం ఇందులో విభిన్న విషయాల పట్ల చర్చలు, సంవాదాలు కొనసాగుతున్నాయి. ఓ ప్రత్యేక ఆలోచనా సరళి కలవారు అధికారాసనాన్ని చేజిక్కుంచుకున్నా దేశవాసుల్లో అసంతృప్తి, అసంతుష్టి ఎల్లెడలా కానవస్తోంది.

అందువల్ల దేశంలో జరుగుతున్న చర్చల్లో, సంవాదాల్లో, గోష్టుల్లో భాగం పంచుకుని ఆచరణాత్మకంగా ఓ సమంజసమయిన మార్గాన్ని సాధించే ప్రయత్నాల్లో ఉద్యమ కార్యకర్తలు తమ నిర్మాణాత్మక పాత్రను రుజువు చేసుకునే అవకాశం ఎంతో ఉంది. అలా సాధ్యమయిన మేర మార్గదర్శకత్వం, పరివర్తనం కొరకు కృషి చేయవచ్చు. మీడియాలో, పత్రికా ముఖంగా సాగే చర్చల్లోనూ పాల్గొని సామాన్య సంవాదాల్లో పాలుపంచుకుని, లేదా స్థానిక పరిపాలనా వ్యవస్థల్లో, అసెంబ్లీ, పార్లమెంటులో జరిగే చర్చలు, సంవాదాల్లో పాల్గొనడం ద్వారాను ఈ లక్ష్యాన్ని కొంతమేర సాధించడం సాధ్యమే.

**(మిగతా 7-3-2025 సంచికలో)**

**వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ నైతిక పథకం**

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# సమాజానికి పునాది కుటుంబం



- రూహీ

**త్రిపుల్ తలాక్** చెప్పి భార్యకు విడాకులు ఇవ్వటానికి ప్రయత్నించిన వ్యక్తుల మీద దాఖలైన ఎఫ్ఐఆర్, చార్జిషీట్ల వివరాలను తమకు అందజేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2019లో మోదీ ప్రభుత్వం చేసిన 'ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ చట్టం' త్రిపుల్ తలాక్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ చట్టంపై పెద్ద ప్రచారమే చేశారు. టీవీల్లో డిబేట్లతో ఊదరగొట్టారు. ఈ చట్టం త్రిపుల్ తలాక్ పద్ధతిని నేరంగా పరిగణించి, ఆ నేరానికి పాల్పడిన వారికి మూడేళ్ల జైలు శిక్షను విధిస్తుంది. దీనిని వ్యతిరేకిస్తూ పలు ముస్లిం సంఘాలు, వ్యక్తులు సుప్రీంకోర్టులో 12 పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయ వాదులు తమ వాదనలో తలాక్ అనే పదాన్ని ఉచ్ఛరించటమే నేరంగా పరిగణించటం అన్యాయమన్నారు. వివాహాన్ని రద్దు చేసు కున్నందుకు దేశంలో ఇతర ఏ మత సమూహమూ ఇటువంటి న్యాయపరమైన సమస్యలు ఎదుర్కోవటం లేదన్నది ఒక వాస్తవం. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ, 'ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ చట్టం' కింద నిందితులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష పడుతుందని, మహిళా హక్కులకు సంబంధించిన చట్టాల్లో ఇదే అతి తక్కువ శిక్ష అని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'త్రిపుల్ తలాక్‌కు ప్రస్తుతం చట్టబద్ధత లేదు. కాబట్టి త్రిపుల్ తలాక్ చెప్పిన తర్వాత కూడా భార్యభర్తలు కలిసి ఉండవచ్చు. కానీ, త్రిపుల్ తలాక్ చెప్పినందుకు భర్తకు జైలు శిక్ష పడుతోంది. దీనినే పిటిషనర్లు వ్యతిరేకిస్తున్నారు' అని వివరించి చెప్పవలసి వచ్చింది. ఈ మేరకు 'ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ చట్టం' కింద దాఖలైన ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్ల వివరాలను కేంద్రం సమర్పించాలని ఆదేశించింది. విచారణను మార్చి 17వ తేదీకి వాయిదా వేసింది

మూడుసార్లు తలాక్ అని పలికితే విడాకులైపోతాయా? నిస్సహాయంగా మిగిలిపోయిన ఆ మహిళ ఏం చేయాలి? త్రిపుల్ తలాక్ దురాచారం నుంచి ముస్లిం మహిళలకు రక్షణ లేదా? ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా త్రిపుల్ తలాక్ నిషేధించింది. ఈ నిషేధాన్ని సమర్థిస్తున్నవారు కొందరు. విమర్శిస్తున్నవారు మరికొందరు. ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని ప్రశ్నిస్తున్నవారు ఇంకొందరు.

త్రిపుల్ తలాక్ పేరుతో ఏకపక్షంగా మహిళకు విడాకులిచ్చారన్న వార్త వినగానే సహజంగా మనం అలాంటి విడాకులను వ్యతిరేకిస్తాం. ఆ మహిళకు న్యాయం జరగాలనుకుంటాం.

అలాగే Pious obligation of Hindu son అంటూ అత్తమామలను చూడడం విషయంలో అభ్యంతర పెడితే, వేరు కాపరం పెడితే విడాకులివ్వడం గురించి చదివినప్పుడు కూడా మనం సహజంగానే వ్యతిరేకిస్తాం. ఆ మహిళకు న్యాయం జరగాలని కోరుకుంటాం.

విడాకులనేవి ముఖ్యంగా మహిళ జీవితాన్ని ఛిన్నాభిన్నం చేస్తాయి.

పిల్లల జీవితాలపై తీవ్ర ప్రభావం వేస్తాయి. విడాకులు పొందిన మహిళల కష్టాలు మన కళ్ల ముందు కదలాడతాయి.

కాని, వివాహం సమాజానికి ఎంత అవసరమో, విడాకులు కూడా అవసరమే. విడాకులు ఒక్కోసారి మహిళకు కూడా అవసరమవుతాయి. బలవంతపు కాపురం కన్నా విడిపోవడమే మంచిదనుకునే పరిస్థితులుంటాయి.

కాబట్టి అయిష్టమైనా విడాకుల అవకాశం వివాహ వ్యవస్థలో ఉండక తప్పదు.

ఏకపక్షంగా అన్యాయంగా విడాకులు పొందిన మహిళ గురించి మన సానుభూతి ఒక్కోసారి మనలో ఆగ్రహావేశాలను రెచ్చగొడుతుంది. ఇలాంటి భావావేశాలనే రాజకీయ నేతలు ఉపయోగించుకుంటారు. మన సానుభూతి, దానివల్ల మనలో జనించిన భావావేశాలు మనల్ని స్వార్థ శక్తుల పన్నాగాలు చూడలేని గుడ్డివారిగా మార్చరాదు. సమాజంలోని వాస్తవాలను, విశాల సమాజ ప్రయోజనాలను గ్రహించలేని స్థితికి చేర్చరాదు.

అందువల్ల ఇలాంటి కేసులు మన దృష్టికి వచ్చినప్పుడు బాధిత మహిళ పట్ల సానుభూతితో పాటు, ఈ విషయమై స్వార్థశక్తుల పన్నాగాలను గ్రహించే వివేచన కూడా అవసరమవుతుంది.

త్రిపుల్ తలాక్ చట్టం గురించి వివాదం రాజుకుంటున్న రోజుల్లో మరో వార్త వచ్చింది. భారతదేశంలోని ముస్లిమ్ మహిళల్లో విడాకుల రేటు అత్యధికంగా ఉందన్నది ఆ వార్త. ఆ వార్త ప్రకారం, జనాభా లెక్కలు 2011లో గణాంకాలను ఉటంకిస్తూ, ప్రతి 1000 మంది ముస్లిమ్ మహిళల్లో 5 గురు విడాకులు తీసుకుంటున్నారని, మిగిలిన వారితో పోల్చితే ఇది చాలా ఎక్కువ అన్నది ఆ వార్త. ముస్లిముల్లో ప్రతి 1000 మంది మహిళల్లో విడాకుల రేటు 5.5 ఉంటే, హిందువుల్లో ప్రతి 1000 మంది మహిళల్లో విడాకుల రేటు కేవలం 1.8 మాత్రమే అన్నారు. త్రిపుల్ తలాక్ వల్లనే ముస్లిముల్లో ఈవిధంగా విడాకుల రేటు ఎక్కువగా ఉందన్నారు. చదివిన వారు నిజమే కాబోలు అనుకున్నారు.

వార్త చదివిన తర్వాత నిజమే కదా అనిపిస్తుంది.

కాని దీనిపై తర్వాత విశ్లేషణలు ఇతర సోర్సెస్ నుంచి చదివిన తర్వాత కాని అసలు సత్యం బోధపడలేదు. 2001 జనాభా లెక్కల ప్రకారం ముస్లిముల్లో విడాకుల రేటు 1000 మంది మహిళలకు 5.3 అయితే 2011 నాటికి 1000 మంది మహిళలకు 5.63 అయ్యింది. అంటే ఈ పది సంవత్సరాల్లో విడాకుల రేటు 0.33 పెరిగింది. ఇందులో తిరకాసు ఏమంటే, హిందువుల్లో విడాకుల రేటు 1.8 ఉంది కాని, విడాకులు తీసుకోకుండా జుడిషియల్ సెపరేషన్ ద్వారా వేర్వేరుగా ఉంటున్న వారి రేటు 1000 మంది మహిళలకు 5.5 కాబట్టి ఈ రెండింటిని కలిపితే వాస్తవానికి వేరుపడిన మహిళల రేటు (అంటే విడాకులు తీసుకున్న వారు జుడిషియల్ సెపరేషన్ తీసుకున్న వారు కలిపి) 7.3 అవుతుంది. అంటే అది ముస్లిముల కన్నా ఎక్కువ. మరి పత్రికలు ఈ వార్తకు బురఖా వేసి ఎందుకు ప్రజల ముందుకు తెచ్చాయి? ముస్లిముల్లో జుడిషియల్ సెపరేషన్ అనేదే లేదు. విడాకుల కోసం సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టు తిరగడం ఉండదు కాబట్టి జుడిషియల్ సెపరేషన్ అవసరమే ఉండదు.

విమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2022 సర్వే పేరుతో వచ్చిన నివేదికలో గృహహింస కేసుల జాబితాలో 50.4% తెలంగాణ రెండవ స్థానంలో ఉందని షాకింగ్ విషయాన్ని వెల్లడించింది. 75% గృహహింస కేసులతో అస్సాం రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచింది. ఆపై తెలంగాణ రాష్ట్రం 50.4 శాతం గృహింస కేసులతో రెండవ స్థానంలో, 48.9%తో ఢిల్లీ మూడవ స్థానంలో నిలిచాయి.

గతంలో సుప్రీంకోర్టు గృహహింస చట్టం, అదే 498ఏ దుర్వినియోగాన్ని నివారించడానికి కొన్న మార్గదర్శకాలు జారీ చేసింది. కాని ఇటీవల వచ్చిన సుభాష్ ఆత్మహత్య కేసు వల్ల ఈ ఈ దుర్వినియోగాలు ఆగలేదన్నది స్పష్టం అవుతోంది. ఐపిసి 498ఏ చట్టం దుర్వినియోగం గురించి చాలా కాలంగా చర్చ జరుగుతూనే ఉంది. తప్పుడు కేసులు వేస్తున్నారని, మనోవర్తి పెద్దమొత్తంలో రాబట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఇలా రకరకాల ఆరోపణలు చాలా వినిపిస్తున్నాయి. ఈ సెక్షను కింద కేసుల్లో శిక్షలు పడిన శాతం చాలా తక్కువ. కాబట్టి ఈ కేసులు చాలా వరకు తప్పుడు కేసులే అని తీర్మానించేవారు కూడా ఉన్నారు. కాని పరిశోధనాధికారులు తగిన శ్రద్ధ చూపకపోతే, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తగిన శ్రద్ధ చూపకపోతే కోర్టుల్లో శిక్షలు పడే అవకాశాలు కూడా ఉండవు కదా. కాబట్టి శిక్షలు పడిన శాతం తక్కువైనంత మాత్రాన కేసులన్నీ తప్పుడు కేసులే అనడం కూడా సరికాదు. అలా అని ఈ చట్టం దుర్వినియోగం కాలేదని కూడా చెప్పలేం. భర్తను, అత్తమామలను వేధించడానికి కేసులు వేసిన వారు కూడా ఉండొచ్చు. ఆ మాట కొస్తే దేశంలో దుర్వినియోగం కాని చట్టమంటూ ఏదన్నా ఉందా? రెవిన్యూ చట్టాలు దుర్వినియోగం కావడం లేదా? దుర్వినియోగమవుతున్న చట్టాలు చాలానే ఉన్నాయి. విచిత్రమేమంటే, 498ఏ చట్టం చాలా కఠినంగా ఉన్న రోజుల్లోను భార్యని చావబాదేవాళ్ళు తమ పని కొనసాగించారు. చట్టం ఎంతవరకు ఆ దుర్మార్గాలను అడ్డుకుందో లెక్కలు

తీసి చెప్పేవాళ్ళు ఎవరూ లేరు. కేవలం చట్టం చేసినంత మాత్రాన సమస్య పరిష్కారం అవుతుందంటే అంతకన్నా హాస్యాస్పదం మరేదీ ఉండదు. ముఖ్యంగా ఇలాంటి సమస్యల్లో సామాజిక ఆలోచనాసరళి మారవలసిన అవసరం ఉంది.

పెండ్లాం బెల్లాం తల్లి దయ్యం, పెండ్లాం బెల్లం ముక్క తల్లి మట్టిగడ్డ లాంటి సామెతలు మనకున్నాయి. ఆలి వైపు వారు ఆత్మబంధువులైరి, తల్లి వైపు వారు తగిన పాటి, తండ్రి వైపు వారు దాయాదులైరయా వగైరా పద్యాలు కూడా చాలా మంది చదివి ఉంటారు. ఇవన్నీ చూస్తే, పెండ్లి తర్వాత మగవాడు భార్యకు దాసోహం అయిపోతాడన్న ఒక భావన కలిగేలా ఉన్నాయి. అది నిజమా?

అది నిజం కాదన్న సంగతి ప్రతిరోజు మనకు కనబడుతూనే ఉంటుంది. భార్యను కొట్టడం అనే అనాగరికమైన చర్య చాలా మామూలు విషయం. వేధింపులు, సతాయింపులు సమాజంలో నిత్యం చూస్తూనే ఉన్నాం. అంటే చెప్పుకోడానికి, జోకులేసుకోడానికి మాత్రమే పెండ్లాం బెల్లం అంటున్నారు కాని నిజానికి పెండ్లాం అంటే స్వంత ఆస్తి ఇష్టమొచ్చినట్లు వాడుకోవచ్చన్న భావనే బలంగా ఉంది.

తల్లి ప్రేమ గురించి సెంటిమెంటల్ గా చెప్పే మాటలు మనం చాలా వింటాం. మాతృదేవోభవ వగైరా ఉపదేశాలు కూడా వింటాం. పతియే ప్రత్యక్ష దైవం వంటి మాటలు కూడా వింటాం. కాని అలాంటి మాటలే భార్య గురించి ఎందుకు వినడం లేదు? ఎందుకు చెప్పుకోవడం లేదు? సామాజిక ఆలోచనాసరళిలో మార్పు రావాలంటే ఇలాంటి మాటలను వెదికి వాటిని ప్రచారంలో పెట్టాలి.

అలాంటి ప్రయత్నమే క్రింది మాటలు.

ఇస్లామ్ మతం ప్రకారమే కాదు, క్రయిస్తవ, యూద మతాల ప్రకారం కూడా ప్రపంచంలో మొట్టమొదటి మానవసంబంధం కేవలం ఆలుమగల సంబంధం మాత్రమే. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, కొడుకులు, కూతుళ్ళు... ఈ సంబంధాలన్నీ తర్వాత వచ్చిన సంబంధాలే. అన్నింటికన్నా ముందు, ప్రప్రథమ మానవ సంబంధం. అనుబంధం భార్య భర్తలదే. ఈ మూడు ప్రధాన మతాలు ఈ విషయాన్ని ఒప్పుకుంటాయి. ఎలాగంటే, ఈ మూడు మతాలూ ఆదమ్ తొలి మానవుడిగా భావిస్తాయి. కొన్ని ఇస్రాయీలీ రిఫరెన్సుల ప్రకారం, తొలి మానవుడు ఆదమ్ ను మట్టితో చేసిన దేవుడు 40 సంవత్సరాల వరకు ఆయన్ను ప్రాణం లేకుండా అలాగే వదిలేశాడట. ఇస్లామ్, క్రయిస్తవ రిఫరెన్సుల ప్రకారం కూడా తొలిమానవుడు ఆదమ్ కు ప్రాణం పోసిన వెంటనే దేవుడు ఆయనకు జంటను సృష్టించలేదు. ఆయన్ను ఒంటరిగానే స్వర్గంలో ఉండమన్నాడు. స్వర్గంలో ఉన్నప్పటికి ఒంటరిగా ఉన్న ఆదమ్ సంతోషంగా లేరు. ఉల్లాసంగా లేరు. చాలా నిరీక్షణ తర్వాత సంతోషాన్ని, ఉల్లాసాన్ని, శాంతిని కలుగజేసేలా దేవుడు ఒకరోజు ఆయనకు జంటగా హవ్వాను సృష్టించాడు. ఆదమ్ ఒకరోజు నిద్ర నుంచి మేల్కొనే సరికి ఆయన ముందు ఆయన జంట, ఆయన భార్య హవ్వ ఉంది.

ఈ ధార్మిక గ్రంథాలు చెప్పే మానవ సృష్టి క్రమంలో తొలి మానవుడు సుదీర్ఘకాలం నిరీక్షించిన తర్వాత మాత్రమే లభించిన అపురూప వరం భార్య. ఈ వాస్తవాన్ని ఎందుకు మనం ప్రచారం చేయలేకపోతున్నాం. భార్య ఒక అపురూపమైన వరం అన్న వాస్తవాన్ని భర్తలకు అర్థమయ్యేలా ఎందుకు చెప్పలేకపోతున్నాం.

ఖుర్ఆన్‌లో రూమ్ అధ్యాయంలో ఆసక్తికరమైన వాక్యాలున్నాయి. దేవుడు మనిషిని మట్టితో సృష్టించాడని చెప్పిన వెంటనే తర్వాతి వాక్యంలో మాటలు గమనించదగినవి. "ఆయన సూచనలలో మరొకటి ఏమంటే, ఆయన మీ కొరకు భార్యలను మీ జాతి నుంచే సృష్టించాడు. మీరు వారి వద్ద శాంతిని పొందడానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్ని సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలున్నాయి"

ఈ వాక్యంలో గమనించవలసిన విషయమేమంటే, భార్యాభర్తల సంబంధాన్ని దేవుడు తన సూచనగా చెప్పడం. మొత్తం ఖుర్ఆన్ గ్రంథంలో మరో బాంధవ్యాన్ని దేన్ని కూడా దేవుడు తన సూచనగా చెప్పలేదు. తల్లిదండ్రుల పట్ల ఉత్తమంగా వ్యవహరించాలన్న వాక్యాలున్నాయి. తల్లిదండ్రులను గౌరవించాలని ఉపదేశాలున్నాయి. కాని తన సూచనగా ఒక బాంధవ్యాన్ని గుర్తించడం అన్నది లేదు. కేవలం భార్యాభర్తల సంబంధం తప్ప. పై వాక్యంలో మీ జాతి నుంచే భార్యలను సృష్టించడం అన్నది ఇస్లామీయ



గ్రంథాల అవగాహన లేనివారికి కాస్త విచిత్రంగా కనిపించవచ్చు. కాని అక్కడ ఆ వాక్యానికి అర్థం మానవజాతిలోని పురుషులకు, మానవజాతికి చెందిన స్త్రీనే జంటగా చేశామన్నది. దేవుడు తలచుకుంటే మరో ప్రాణిని నీ జంటగా చేయగలిగి ఉండేవాడే అని చెప్పడం. ఈ బాంధవ్యంలో మూడు ముఖ్యమైన విషయాలను ప్రస్తావించాడు. ఒకటి శాంతిని పొందడం. రెండు ప్రేమ, మూడు కారుణ్యం. శాంతి అన్న పదం అనువాదంలో వాడారు కాని అసలు పదం సుకూనత్ అంటే ఒక ప్రశాంతచిత్తం, ఎలాంటి అలజడి లేని హాయి. కేవలం భార్యాభర్తల సంబంధంలోనే అది లభిస్తుందని చెబుతూ, ప్రేమ, కరుణ అనే రెండు పదాలను వరుసగా ఉపయోగించడానికి కారణాలు కొందరు వ్యాఖ్యాతలు వివరించారు. పెళ్ళయిన కొత్తలో, వయసులో ఉన్నప్పుడు ఆలుమగల మధ్య లైంగిక సంబంధం వారి మధ్య బలమైన ప్రేమకు పరాకాష్ఠగా అవుతుందని, వయసు మళ్ళిన తర్వాత శరీరం శక్తులుడిగిన తర్వాత కూడా ఈ ప్రేమ ఒకరి పట్ల మరొకరు కరుణాపూరితంగా వ్యవహరించేలా చేస్తుందని వివరించారు.

ఈ బాంధవ్యంలోని ఈ గొప్పదనాన్ని ఇప్పుడు వివరణాత్మకంగా ఎందుకు ప్రచారం చేయడం లేదు? ఇదేదో పవిత్రసంబంధం కాదు. ఇది ప్రేమకారుణ్యాల సంబంధం. ఇక్కడ ప్రేమ అన్నది ఏదో అలౌకికమైన ప్రేమ కాదు. ఇది మనిషి సహజమైన లైంగిక ఆకర్షణ వల్ల జనించిన ప్రేమ, ఆ ప్రేమే తర్వాత ఒకరి పట్ల మరొకరిలో కరుణార్ద్రమైన భావనగా మారుతుంది. భార్యాభర్తల సంబంధం పవిత్రబంధం అంటూ ఆచరణకు సాధ్యం కాని దైవత్వమూ దానికి కల్పించనవసరం లేదు. ఇది మానవీయమైన సంబంధం. మనుషుల మాదిరిగా కలిసి ఉండవలసిన బాంధవ్యం. ప్రేమకరుణల సంబంధం. దాని గురించి గొప్పగా చెప్పుకోవాలి.

పైన చెప్పిన ఖుర్ఆన్ అధ్యాయంలో దేవుడు తన సృష్టిలో తన ఉనికికి సంబంధించిన సూచనలను తెలియజేశాడు. రాత్రిపగలు, భాషలు, యాసలు, శరీరవర్ణాలు, భూమ్యాకాశాలు, మెరుపులు, వర్షం కురిసి నేలపై పచ్చిక ప్రాణం పోసుకోవడం వీటన్నింటిని ప్రస్తావిస్తూ, అదే వరుసలో భార్యాభర్తల సంబంధాన్ని ప్రస్తావించాడన్నది గమనించాలి. తన ఉనికిని గుర్తించే సూచనల్లో భార్యాభర్తల సంబంధం, అందులోని ప్రేమ, కరుణ, వీటన్నింటిని స్వయంగా దేవుడే ప్రస్తావిస్తుంటే మతానుయాయులు దానికి ఎంతగా నిబద్ధులు కావాలి.

భార్య తనతో బాగుంటే తాను కూడా భార్యతో చక్కగా వ్యవహరించడంలో సామరస్యం ఏముంది? ఇమామ్ గజాలీ చెప్పిన ఒక మాట ఈ సందర్భంగా గమనించదగింది. తలబిరుసు, అవిధేయత, తిరస్కారంతో వ్యవహరించే భార్య పట్ల సహనం, ఓర్పు ప్రదర్శించిన భర్త ప్రళయదినాన నోవా, లూత్ ప్రవక్తలతో పాటు ఉంటాడని చెప్పారాయన. అలాగే దుర్మార్గం, తలబిరుసు, తిరస్కారంతో వ్యవహరించే భర్త పట్ల సహనం చూపిన భార్య హజ్రత్ ఆసియా (ఫారో భార్య)తో పాటు ఉంటుందని చెప్పారు. ఈ మాటల అంతరార్థం భార్యాభర్తలు ఒకరి పట్ల ఒకరు సహనం, ఓర్పు కలిగి ఉండాలన్నది. ఒకరి మాటతీరు, వ్యవహారశైలి నచ్చకపోయినా సర్దుకుపోవాలన్నది. కేవలం భార్యకు మాత్రమే బోధించలేదు. భర్తకు కూడా బోధించడం జరిగింది. నిజానికి భర్తకే ముందు చెప్పడం జరిగింది. తర్వాత భార్యను కూడా ఈ బోధనలో కలిపారు.

ఖుర్ఆన్ ఈ విషయంలో స్పష్టంగా పుణ్యాత్ములైన భార్యాభర్తల జంటను అలాగే స్వర్గంలో కొనసాగిస్తారని ప్రకటించింది. అంటే ఇదొక్కటే శాశ్వతమైన సంబంధం. మరో విషయమేమంటే, ప్రవక్త ముహమ్మద్ (స)హదీసు ప్రకారం ఆదమ్‌ను సృష్టించిన తర్వాత దేవుడు ఆయనకు జంటగా హవ్వాను ఆదమ్ ఎడమ పక్కటెముకతో సృష్టించాడని చెప్పారు. ఈ హదీసుకు వ్యాఖ్యాతలు వివరణ ఇస్తూ, స్త్రీ స్థానం హృదయానికి దగ్గరగా ఉందని, అందువల్లనే ఎడమ పక్కటెముకతో సృష్టించాడని అన్నారు. ఈ సందర్భంగా గమనించవలసిన మరో విషయం ఏమంటే ప్రవక్త ముహమ్మద్ చెప్పిన మరో హదీసు ప్రకారం "స్త్రీల పట్ల కరుణతో వ్యవహరించండి. స్త్రీ పక్కటెముకతో చేయబడింది. పక్కటెముక వంకరగా ఉంటుంది. దాన్ని తిన్నగా చేయాలని ప్రయత్నిస్తే విరిగిపోతుంది. అలాగే ఉంచితే వంకరగానే ఉంటుంది. కాబట్టి కరుణతో వ్యవహరించండి.'' ఈ మాటలకు వివరణ ఇస్తూ వ్యాఖ్యాతలు చెప్పిన మాటలు గమనించాలి. భర్త అనుకున్నట్లు భార్య ఉండడం, అలాగే వ్యవహరించడం కూడా జరక్కపోవచ్చు. ఆమె తన ఇష్టం వచ్చినట్లే ఉంటుంది. ఆమె మాటలు ఒక్కోసారి అతన్ని బాధించనూ వచ్చు. ఈ హదీసు కేవలం భర్తలను మాత్రమే ఉద్దేశించింది కాదు, తండ్రి, అన్న, తమ్ముడు, మామ వగైరా బంధువులైన పురుషులందరినీ ఉద్దేశించినది. కాబట్టి స్త్రీ మాటలు, చేతలు ఏవైనా బాధించినా ఆమెను సరిచేయాలని ప్రయత్నించి విరిచేయకండి అని చెప్పడం జరిగింది.

మరో హదీసు ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స)ఒకసారి మాట్లాడుతూ ''భార్య పట్ల ఉత్తమంగా వ్యవహరించేవాడే మీలో ఉత్తముడు'' అన్నారు. ఈ మాటలు ముస్లిములెందరు పాటిస్తున్నారో ఆత్మవిమర్శ చేసుకోవలసిన అవసరం ఉంది. ప్రవక్త ముహమ్మద్ (స)తమకు ఆదర్శమని ప్రకటించుకునే ప్రతి

ముస్లిమ్ గమనించవలసిన వాస్తవమేమంటే, ప్రవక్త ఇంటిపనుల్లో సహాయపడేవారు, పిండి కలిపేవారు, తన దుస్తులకు తానే కుట్లు వేసుకునేవారు, తన చేతులతో భార్యకు తినిపించేవారు, భార్యతో పరుగు పందెం వేసేవారు. ఎంతమంది నేడు ఇంటిపనుల్లో సహాయ పడుతున్నారు? ఎంతమంది భార్యకు మానసికోల్లాసం కలిగేలా బయట తీసుకెళ్ళడం, సరదాగా పందెం వేసుకోవడం వంటివి చేస్తున్నారు. ఇంకా గట్టిగా చెప్పాలంటే ఒకే పాత్రలో నీళ్ళతో భార్యాభర్తలు కలిసి స్నానం చేసేవారు. భార్యాభర్తల మధ్య బాంధవ్యాన్ని బలపరిచే ఈ మాటలు ఎంతమంది పాటిస్తున్నారు.

పెళ్ళి చేసుకున్న తర్వాత భార్య ప్రయివసీని ఎంతమంది గుర్తిస్తున్నారు. ఉమ్మడి కుటుంబం అన్న భావన ఇస్లామ్‌లో లేదు. కాని విచిత్రమేమంటే ఇప్పుడు అదో గొప్ప నైతిక విషయమైపోయింది. ఒకరికి ఒకరు సహాయపడుతూ అందరూ కలిసిమెలిసి ఉండే ఉమ్మడి కుటుంబం మంచిదే. కాని ఇప్పుడలా ఉందా? అత్తమామల సూటిపోటి మాటలు, మరదళ్ళకు, మరుదులకు సేవలందించే మెషీన్‌లా ఇంటికొచ్చిన కోడలిని మార్చడం జరగడం లేదా? పెళ్ళయిన తర్వాత ప్రత్యేకంగా వేరే ఇంట్లో పెట్టాలన్నది ఇస్లామీయ బోధనల్లో ఉన్న విషయమే. అంత స్తోమత లేకపోతే అందరూ కలిసి ఉంటున్నప్పటికీ భార్యాభర్తలు ప్రత్యేకంగా ఒక గది, వంటిల్లు కలిగి ఉండాలి. అదీ సాధ్యం కాకపోతే కనీసం ప్రత్యేకంగా ఒక గది ఇచ్చే స్తోమత అన్నా ఉండాలి. ఆ స్తోమత కూడా లేకపోతే పెళ్ళి చేసుకోరాదు. మీలో స్తోమత ఉన్నవాళ్ళు వెంటనే వివాహం చేసుకోవాలి, స్తోమత లేనివారు ఉపవాసాలు పాటించడం ద్వారా తమ కోరికలను అదుపులో ఉంచుకోవాలని ప్రవక్త చెప్పారు. అంటే పెళ్ళి చేసుకోడానికి స్తోమత అన్నది షరతు, మగవాడికి వర్తించే షరతు. ఆ షరతుకు అనుగుణంగా ఉన్నప్పుడే పెళ్ళి చేసుకోవాలి. లేకపోతే ఉపవాసాలు పాటిస్తూ కోరికలను అదుపు చేసుకోవాలి అంతే తప్ప స్తోమత లేకపోయినా పెళ్ళి చేసుకుని ఒక అమ్మాయి గొంతు కోయడం తగిన పని కాదు.

ఎందుకంటే భార్యాభర్తల సంబంధం సమాజానికి పునాది వంటిది. సమాజంలో శాంతిశ్రేయాల చల్లని నీడ కొనసాగాలంటే ఈ సంబంధంలో సంతోషం ఉల్లాసాలు ఉండాలి. మరో హదీసులో ప్రవక్త చెప్పిన మాటలు కూడా ఇక్కడ గమనార్హమైనవి. షైతాను ప్రతిరోజు దర్బారు నిర్వహిస్తాడట. తన అనుచరులను అడుగుతాడట. ఈ రోజు మీరు సాధించింది చెప్పండని. ఒక్కో అనుచరుడు తాను ఫలానా మనిషిని ఫలానా దుర్మార్గం చేసేలా ప్రోత్సహించానని, తప్పుదారి పట్టించానని ఇలా చెబుతున్నప్పటికీ షైతానుకు సంతోషం కలుగదు. మీరంతా ఏమీ గొప్ప పని చేయలేదు అంటుంటాడు. చివరకు ఒక అనుచరుడు లేచి, దొర, నేను ఒక భార్యాభర్తల జంటలో మనస్పర్థలు పెంచి వాళ్ళు విడిపోయేలా చేశానంటాడు. ఆ వెంటనే షైతాన్ వాడిని పిలిచి శభాష్....చాలా గొప్ప పని చేశావు అని కావలించుకుంటాడు. అంటే మానవాళిని నాశనం చేయాలనుకునే షైతానుకు భార్యాభర్తల సంబంధం తెగిపోవడం అన్నది ఎంతో సంతోషకరమైన విషయం. ఎందుకంటే, ఈ సంబంధం తెగిపోతే సమాజం పునాదులు కదులుతుంటాయి. భవిష్యతరాల బతుకులు నాశనమవు తుంటాయి.

ఇస్లామ్‌ను పాటిస్తామనుకునే ముస్లిములందరూ గమనించవలసిన వాస్తవాలివి.

ఇవన్నీ ఏవో ధార్మిక విషయాలని పక్కన పెట్టవచ్చు. కాని ఇవి సమాజానికి దిశా నిర్దేశం చేసే విషయాలుగా కూడా గమనించాలి.

"వారు (భార్యలు) మీకు దుస్తులు. మీరు వారికి దుస్తులు"
(అల్ బఖర్ 187)

భార్యాభర్తల సంబంధాన్ని ఖుర్‌ఆన్ వర్ణించిన తీరిది. దుస్తులకు మనిషి శరీరానికి మధ్య స్పేస్ మరేదీ ఉండదు. అలాంటి సాన్నిహిత్యం భార్యాభర్తల మధ్య ఉండాలని, వారి మధ్య రహస్యాలు ఉండరాదని, సుఖదుఃఖాలన్నీ సమానంగా ఉండాలని, దుస్తులు శరీరాన్ని వాతావరణం నుంచి కాపాడినట్లు ఒకరినొకరు కాపాడాలని, శరీరంలో లోపాలను దుస్తులు కప్పినట్లు భార్యాభర్తలు ఒకరి లోపాలను మరొకరు కప్పిపెడుతూ ఒకరికి ఒకరుగా ఉండాలని, దుస్తులు మనిషికి అందాన్నిచ్చినట్లు ఒకరికి ఒకరు అందాన్ని ఆహ్లాదాన్ని ఇస్తూ ఉండాలన్నది దానికి భావం.

ఇవన్నీ కుటుంబం, భార్యాభర్తల సంబంధాలకు సంబంధించిన విషయాలు. ప్రపంచంలో జనాభా అత్యధిక శాతం మతావలంబీకులు కాబట్టి మతాలు ఈ విషయంలో బోధించే మంచి మాటలను ప్రచారంలో పెట్టడం వల్ల ఆలోచనాసరళిలో మార్పులు వచ్చే అవకాశాలున్నాయి.

కేవలం చట్టాలు చేయడం వల్ల మార్పులు రావు. ఆలోచనా సరళిలోను మార్పులు రావాలి. త్రిపుల్ తలాక్ చట్టంపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ల సంఖ్య ఎంతో, ఈ చట్టం సాధించిందేమిటో తర్వాత ఎలాగూ తెలియవస్తుంది. కాని తెలుసుకోవలసిన విషయం కుటుంబవ్యవస్థను నిలబెట్టడానికి పాటించవలసిన విషయాలను నైతిక ప్రమాణాలను తెలుసుకుని ఆచరించడం.

# పశ్చాత్తాపం

**- రజియా, సత్తుపల్లి**

**మనుషుల్లో** తప్పు చెయ్యనివాడు, పాపం చెయ్యనివాడు ఎవరున్నారని. ప్రతి రోజూ ఏదో ఒక పొరపాటు చిన్నదో, పెద్దదో తెలిసో, తెలియకో జరిగిపోతూ ఉంటుంది. ఉదాహరణకు తోటివారిపై అపనిందలు వేయడం, మానసికంగా హింసించడం, దుర్భాషలాడడం, ఒకరి పరువు మర్యాదలపై బురద చల్లడం, ఉక్రోశం పెంచుకోవడం, మోసం, దగా, దొంగతనం, స్వార్థంతో పరుల హక్కుల్ని కొల్లగొట్టడం, మద్యపానం, జూదం, లంచగొండితనం, అత్యాచారాలు ఇవన్నీ మనం చూస్తూనే ఉన్నాము. ఇవన్నీ మనిషి పవిత్ర జీవితాన్ని కల్మషపరిచి, పతనావస్థకు దారి తీసే అతి క్రూరమైన చేష్టలు అనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

అయితే తప్పు జరిగిపోయాక ఆ తప్పును తప్పుగా పొరపాటుగా మనసులో భావించి పశ్చాత్తాపం పొంది మళ్ళీ రుజుమార్గం వైపునకు మరలే సన్మార్గ గాములు కూడా కొందరు ఉన్నారు. దైవం దృష్టిలో వీరు ఇలాంటి వారు సత్పురుషులు అనే విషయం గ్రంథంలో వుంది. కాని కొంత మంది స్వార్థపరులు, గర్విష్టులు సన్మార్గాన్ని పొందటం అటుంచి అసలు తప్పుని తప్పుగా, పాపాన్ని పాపంగా భావించే సద్బుద్ధి వారికి లేదు. ఇక వారికి పశ్చాత్తాపం గానీ, సన్మార్గం గానీ ఎలా లభిస్తాయి. వారు షైతాన్‌కు సోదరులై, దుర్వ్యసనాలకు బానిసలై తమ గమ్యం ఏమిటో వారికి అర్థం కావటంలేదు.

జరిగిపోయిన తప్పుకు, పాపానికి పశ్చాత్తాపం చెందే వారంటే దేవునికి అత్యంత ప్రియమైనవారు. వారు మరల అలాంటి పాపాలకు ఒడిగట్టరు. పశ్చాత్తాపం పొందుతూ దైవాన్ని వేడుకుంటారు. అలాంటి వారి కొరకు దైవం అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అని గ్రంథం బోధిస్తుంది.

ఇక్కడ ఒక ఉదాహరణ చూడండి! ఒక ప్రయాణికుడు తన ఒంటెపై ప్రయాణం చేస్తున్నాడు. అతడు ప్రయాణంలో అలసిపోయి ఒక చెట్టునీడలో సేద తీర్చుకుని నిద్రపోతున్నాడు. ఆ సమయంలో అతని ఒంటె ఎటో వెళ్ళిపోయింది. లేచి చూసేసరికి ఒంటె లేదు. దానిపై ఆహారం, నీరు ఉన్నాయి. అటూఇటూ తిరిగి వెతికి వేసారి నిశ్చేష్టుడై నిరాశతో కూర్చున్నాడు. అంతలోనే తన తప్పిపోయిన ఒంటె తన ఎదురుగానే వచ్చి నిలబడింది. ఇక అతని సంతోషానికి అవధుల్లేవు. అలాగే వక్రమార్గంలో పడ్డ వ్యక్తి సన్మార్గానికి మరలి పశ్చాత్తాపపడి క్షమాభిక్ష కోరితే దైవానికి ఎంత సంతోసం కలుగుతుందంటే, ఆ ప్రయాణికునికి ఒంటె దొరకగానే కలిగిన సంతోషం కంటే ఎన్నో రెట్లు దైవానికి సంతోషం కలుగుతుంది.

దైవం దృష్టిలో రెండు రకాల గుణాలు కల మానవులున్నారు. ఒక వర్గం పాపం జరిగిపోతే పశ్చాత్తాపాన్ని స్వీకరించే గుణం కలవారు, మరల అలాంటి చెడు జోలికి కూడా పోనటువంటి వారు దైవం ముందు మోకరిల్లి క్షమాభిక్ష పెట్టమని అర్థించేవారు. ఇలాంటి వారు ఇహపరలోకాల్లో సుఖ శాంతుల్ని పొందుతారు. ఇక రెండవ మార్గం వారు చెడును చెడుగా భావించరు. తమ హృదయంలో స్వార్థం, గర్వం తిష్టవేసుకుని వున్న కారణంగా వారు మంచి చెడు అనే విచక్షణను గుర్తించటం లేదు.

వాస్తవంగా చారిత్రక విషయం ఏమిటంటే దివ్య ఖుర్‌ఆన్ గ్రంథం ఇలా ప్రబోధిస్తుంది. దైవం సృష్టిని సృజించకపూర్వం ఒక పరీక్ష పెట్టాడు. అది ఏమిటంటే ఆది మానవుల జంట అయిన ఆదం–హవ్వాలను సృష్టించి వారిని స్వర్గంలో ప్రవేశపెట్టాడు. అక్కడ పక్కనే ఉన్న వృక్షం వద్దకు వెళ్ళవద్దని, దాని పండ్లు తినవద్దని పరీక్ష పెట్టగా ఆ దంపతులు షైతాన్ మాటలు విని ఆ వృక్షపు పండ్లు తినగానే వాళ్ళు దైవ అవిధేయతకు పాల్పడిన వారయ్యారు. వారిని స్వర్గం నుండి బయటకు పంపడం జరిగింది. అప్పుడు ఆదం పశ్చాత్తాప పడి దైవాన్ని క్షమాభిక్ష అర్థించాడు. సృష్టికర్త దైవం ఆయన వేడుకోలును మన్నించి ఆయన పొరపాటును క్షమించి భూమండలంపై ఆ ఇరువురు దంపతులకు నివాసం ఏర్పరిచాడు. సకల సామగ్రిని వారికి ప్రసాదించాడు. ఆ ఆది మానవుల జంట సంతానమే మనమంతా అని గ్రంథం బోధిస్తుంది.

ఇక షైతాన్‌కు కూడా పరీక్ష పెట్టాడు దైవం. అల్లాహ్ ఏమన్నాడంటే గౌరవప్రదమైన నా ప్రథమ మానవుడైన ఆదం ముందు నీవు గౌరవ సూచకంగా సాష్టాంగపడమని ఆజ్ఞాపించాడు. కాని షైతాన్ అందుకు తిరస్కరించి ధిక్కరించాడు. అతడు పశ్చాత్తాపం చెందలేదు సరికదా తిరస్కారానికి గురయ్యాడు. ఇక మానవులను కూడా తనవైపు తిప్పుకోవడానికి ఎల్లవేళలా వేచి వున్నాడు. ఇలా షైతాన్ అడుగు జాడల్లో నడిచి అతని సోదరుల వలే మెలిగే మానవులకు ఇక మంచి చెడుల విచక్షణా జ్ఞానం ఉండదు. అలాంటి వారు పాపాన్ని పాపంగా భావించరు. వారికి పశ్చాత్తాపం అనే సుగుణం తెలియదు. ఇక అలాంటి వారికి దైవ సహాయం ఎలా తోడ్పడుతుంది? దైవం ఏమంటున్నాడంటే ఇక నేను అలాంటి షైతాన్ గుణాలుగల మానవుల హృదయాలకు సీలు వేస్తాను. వారికి ఇక మంచిని గురించి ఆలోచించే పరిజ్ఞానం లభించదు. ఇక్కడ అర్థమయ్యే విషయం ఏమిటంటే ఆదం, ఆదం సంతానమైన మానవులందరూ పశ్చాత్తాపడి దైవాన్ని వేడుకునే వారే కాని షైతాన్ పోకడలను అలవర్చుకున్న వ్యక్తులకు సన్మార్గ భాగ్యం లభించదు. అందువల్ల ప్రతి మంచి పనిని ప్రతి సత్కార్యాన్ని మనం ఆచరించాలి. ఎల్లప్పుడూ దైవ విధేయులై ఆయన ఆజ్ఞాపాలన చేయాలి. తప్పకుండా ఇహపర లోకాల్లో సుఖశాంతులు లభిస్తాయి.




## కులగణనలో పారదర్శకత లేదు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణన సర్వే పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని జమాఅతె ఇస్లామీహింద్ వరంగల్ జిల్లా అధ్యక్షులు ముహమ్మద్ అబ్దుల్ హన్నాన్ అన్నారు. ఫిబ్రవరి 9న హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2024 వరకు జనాభా లెక్కలు తారుమారయ్యాయని, బీసీలు 56.33 శాతం, ఎస్సీలు 17.43, ఎస్టీలు 10.45, ఓసీలు 15.79 శాతంగా ఉన్నట్లు ప్రకటించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. 16లక్షల మంది (3.1)శాతం గణనలో పాల్గొనలేదని తెలిపారు. సంస్థ కార్యదర్శి ముజాహిద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ ముస్లిమ్ సమాజం ఎల్లప్పుడు వెనుకబడిన బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం 42శాతం సీట్లు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సర్వే రిపోర్టులో ఉన్న తప్పులను సరిదిద్ది, పూర్తి స్థాయి నివేదికను వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో ముహమ్మద్ వహాజుల్ హక్, సర్వత్ అలీ ముబీన్, సైఫ్, తహసీన్, బాబర్, అబ్దుల్ అలీం, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి సూచీలో భారత్‌కు 96వ ర్యాంకు

దేశంలో అవినీతి ఏటా పెరుగుతున్నది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ వెలువరించిన వార్షిక కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్(సీపీఐ)-2024 నివేదికలో భారత్ ర్యాంకు మరింత దిగజారింది. 2023లో 93వ ర్యాంకులో ఉండగా, 2024లో 96కి పడిపోయింది. 180 దేశాలకు ప్రతియేటా స్కోర్, ర్యాంకులను ఇస్తారు. 100 పాయింట్లకు గానూ ఇచ్చే స్కోర్‌లో తక్కువ పాయింట్లు సాధించిన దేశాల్లో ఎక్కువ అవినీతి ఉన్నట్టు, ఎక్కువ పాయింట్లు సాధించిన దేశాల్లో తక్కువ అవినీతి ఉన్నట్టు లెక్క.

## 500 కోట్ల మందికి మెడికల్ ఆక్సిజన్ దూరం

ప్రపంచంలో మూడింట రెండు వంతుల మందికి మెడికల్ ఆక్సిజన్ అందుబాటులో లేదు. అంటే సుమారుగా 500 కోట్ల మంది ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మెడికల్ ఆక్సిజన్ దొరకని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో ఈ అసమానతలు అత్యధికంగా ఉన్నాయని న్యూ లాన్సెట్ కమిషన్ నివేదిక పేర్కొంది. ఆరోగ్య రంగంలో రోగుల చికిత్సకు మెడికల్ ఆక్సిజన్ అత్యవసరం. సర్జరీ, ఆస్థమా, ట్రామా, చైల్డ్ కేర్ తదితర విభాగాలకు ఇది అత్యంత కీలకం. కొవిడ్ 19 వంటి మహమ్మారిని తట్టుకోవాలంటే మెడికల్ ఆక్సిజన్ నిల్వలు తప్పనిసరి. ఈ నేపథ్యంలో మెడికల్ ఆక్సిజన్ లభ్యతపై లాన్సెట్ గ్లోబల్ హెల్త్ మిషన్ ఒక నివేదికను తయారు చేసింది. ప్రపంచంలో మెడికల్ ఆక్సిజన్ పంపిణీలో చోటుచేసుకున్న అసమానతలను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రథమ నివేదిక ఇది.

## భారత్‌లో పెరిగిన విద్వేష ప్రసంగాలు



భారత్‌లో గత ఏడాది విద్వేషపూరిత ప్రసంగాలు భారీగా పెరిగాయని వాషింగ్టన్ కేంద్రంగా పని చేసే సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఆర్గనైజ్డ్ హేట్ (సీఎస్ఓహెచ్)లోని ఇండియా హేట్ ల్యాబ్ పేర్కొన్నది. 2024 ఏడాదిలో భారత్‌లో ద్వేషపూరిత ప్రసంగాలపై ఈ సంస్థ ఇటీవల నివేదికను వెలువరించింది. 2024లో దేశంలో 1,165 విద్వేష ప్రసంగాలు ఇచ్చారని, ఇది 2023 కంటే 74 శాతం అధికమని ఈ నివేదిక పేర్కొన్నది. సాధారణ ఎన్నికల వేడి పతాక స్థాయిలో ఉన్న మే నెలలో ఎక్కువగా ఈ ప్రసంగాలు చేసినట్టు వెల్లడించింది. విద్వేష ప్రసంగాలు చేసిన వారిలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లాంటి అనేక మంది రాజకీయ నేతలు ఉన్నట్టు తెలిపింది. ముస్లింల తర్వాత క్రైస్తవులను లక్ష్యంగా ఈ విద్వేష ప్రసంగాలు చేసినట్టు వెల్లడించింది. బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో విద్వేష ప్రసంగాలు ఎక్కువగా చేసినట్టు తెలిపింది. 2024లో భారత్‌లో నమోదైన మొత్తం విద్వేష ప్రసంగాల్లో సగానికి పైగా బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోనే చేసినట్టు వెల్లడించింది.

సర్వత్రా

## అమెరికాలో ట్రంపొచ్చె.. మార్కెట్ పోయే!

శ్వేతసౌధంలో అడుగుపెట్టిన రోజు నుంచీ ట్రంప్ జారీ చేస్తున్న ఉత్తర్వులు, తీసుకుంటున్న నిర్ణయాలు, విధిస్తున్న సుంకాల దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా స్టాక్‌మార్కెట్లు అల్లాడిపోతున్నాయి. మరీ ముఖ్యంగా మన బీఎస్ఈ సెన్సెక్స్, నిఫ్టీ50 కుదేలై.. ఈక్విటీ ఇన్వెస్టర్లు ఐదంటే ఐదు రోజుల్లో రూ.16.97 లక్షల కోట్లు నష్టపోయారు. 22 రోజుల్లో రూ.23 లక్షల కోట్లు ఆవిరైపోయాయి!! అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టడం ప్రపంచ ఈక్విటీ మార్కెట్లకు అశనిపాతంగా మారింది. అధికారం చేపట్టిన రోజు నుంచి ట్రంప్ తీసుకున్న పలు నిర్ణయాలు స్టాక్ మార్కెట్లను కుదేలు చేశాయి.

## వందేళ్లకు పైబడినవారి సంఖ్య లక్షల్లో ఉందా?

ప్రపంచవ్యాప్తంగా 2024 నాటికి 100ఏళ్లకు పైబడిన వారి సంఖ్య దాదాపు 5 లక్షల 88 వేలు ఉందని ఐక్యరాజ్యసమితికి చెందిన పాపులేషన్ డివిజన్ అంచనా వేస్తోంది. ఈ దశాబ్దం చివరి నాటికి ఈ సంఖ్య పది లక్షలు దాటుతుందని భావిస్తున్నారు.1999లో వందేళ్లకు పైడిన వారి సంఖ్య 92 వేల మంది ఉన్నారు.

## వలసదారుల అణచివేత తగదు

అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు అమెరికా భారీ బహిష్కరణ కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా పోప్ ఫ్రాన్సిస్ స్పందించారు. అక్రమంగా ఉన్నారనే కారణంతో వారిని బలవంతంగా పంపించి వేయడమనేది వారి గౌరవాన్ని తగ్గించినట్టే అవుతుందన్నారు. అమెరికా బిషప్‌లకు లేఖ రాసిన పోప్.. వలసదారుల అణచివేతకు ట్రంప్ యంత్రాంగం చేపట్టిన కార్యక్రమం విజయవంతం కాదని పేర్కొన్నారు. నేరస్థుల నుంచి తమ ప్రజలను రక్షించుకునే హక్కు ఆయా దేశాలకు ఉందని పోప్ ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. అయితే, తీవ్ర పేదరికం, హింస, అభద్రత, దాడులు, వాతావరణ విపత్తుల కారణంగా సరిహద్దులు దాటి వచ్చే వారిని మాత్రం స్వాగతిం చాలని, వారికి రక్షణ కల్పించాలన్నారు. ఇందుకోసం తమ సామర్థ్యాల మేరకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. అయితే, అమెరికాలో కొనసాగుతున్న ఆపరేషన్‌పై తీవ్ర ఆందోళన చెందుతున్నట్టు చెప్పిన పోప్.. అది సరైన ఫలితం ఇవ్వదన్నారు. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. దాదాపు 8వేల మంది అక్రమ వలసదారులను అరెస్టు చేసినట్టు వైట్‌హౌస్ వెల్లడించింది. వీరిలో కొందరిని వెనక్కి పంపించగా.. మరికొందరు జైళ్లలో, ఇంకొందరు నిర్బంధ కేంద్రాల్లో ఉన్నట్లు తెలిపింది.

## హజ్‌లో పిల్లల ప్రవేశంపై నిషేధం



హజ్ యాత్రకు వచ్చే భారీ జనసందోహం వల్ల పిల్లలకు ఏ విధమైన ముప్పు ఏర్పడకూడదనే ఉద్దేశంతో పిల్లల ప్రవేశంపై నిషేధం విధించామని హజ్, ఉమ్రా మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే, మొదటి సారిగా వచ్చే యాత్రికులకు హజ్ యాత్ర-2025లో ప్రాధాన్యం కల్పిస్తామని పేర్కొంది. జీవితంలో కనీసం ఒక్కసారైనా హజ్‌యాత్ర చేయాలనే మతపరమైన అంశాన్ని పరిగణనలోకి తీసుకొని మరింత మందికి ఈ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. అలాగే, అనుమతి లేకుండా హజ్‌యాత్రలో పాల్గొనడాన్ని నివారించేందుకు ఈ నెల 1వ తేదీ నుంచి భారత్ సహా 14 దేశాల యాత్రికులకు సింగిల్ ఎంట్రీ వీసాలు మాత్రమే జారీ చేస్తున్నట్టు వివరించింది. దీర్ఘకాలిక వీసాతో దేశంలోకి ప్రవేశించినవారు అనుమతి లేకుండా హజ్ యాత్రలో పాల్గొనడం వల్ల రద్దీ పెరుగుతుందని పేర్కొంది. దీంతో రద్దీ నియంత్రణ కష్టమై సురక్షాపరమైన మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, యాత్రికులు అధికారిక మార్గాల్లో(చానల్స్)నే పేర్లు నమోదు చేసుకోవాలని, సమస్యల నివారణకు నూతన మార్గదర్శకాలను అనుసరించాలని సూచించింది. ఆ 14 దేశాలు.. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఇండోనేసియా, ఇరాక్, జోర్డాన్, యెమన్, అల్జీరియా, ఈజిప్ట్, ఇతియోపియా, మొరాకో, నైజీరియా, సూడాన్, తునీసియా దేశాల నుంచి సౌదీ అరేబియాకు వచ్చేవారికి ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సింగిల్ ఎంట్రీ వీసాలు మాత్రమే జారీ చేస్తున్నట్టు సౌదీ ప్రభుత్వం తెలిపింది.

# పవిత్ర రమజాన్ మాసాన్ని హృదయపూర్వకంగా స్వాగతించాలి

**ముహమ్మద్ వహీదుద్దీన్**

**విశ్వాసులపై తన కారుణ్య వర్షాన్ని కురిపించడానికి సకల శుభాల పవిత్ర మాసం రమజాన్ మొదలు కాబోతోంది. షాబాన్ మాసం ముగియబోతోంది.**

రజబ్, షాబాన్ మాసాల్లో నెలవంకను చూసి..."ఓ అల్లాహ్! మమ్మల్ని రమజాన్ మాసం వరకూ చేర్చు" అని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ప్రార్థించేవారు.

ఈ శుభాల, వరాల వసంతానికి స్వాగతం పలకడానికి షాబాన్ మాసం నుంచి మనమంతా సిద్ధం కావాలని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ఉపదేశించేవారు.

"ఒక శుభప్రదమైన మాసం రాబోతోంది. ఈ మాసంలో ఉపవాసాలను (రోజాలను) అల్లాహ్ మీకు 'ఫర్డ్' (విధి)గా నిర్దేశించాడు. ఈ మాసంలో స్వర్గ(జన్నత్) ద్వారాలు తెరుచు కుంటాయి. నరక (దోజక్) ద్వారాలు మూసుకుంటాయి. షైతాన్లు (ఇబ్లీస్) సంకెళ్ళతో బంధించబడతారు.

వెయ్యి మాసాలకన్నా శ్రేష్ఠమైన, గొప్పదైన మహా రాత్రి ఈ మాసంలోనే ఉంది. పూర్తి విశ్వాసంతో, ఉత్సాహంతో రమజాన్ మాసానికి స్వాగతం చెప్పేవారు గొప్ప అదృష్టవంతులు.

"ఆరాధనకు ఇది ఎంతో ముఖ్యమైన నెల" అని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ఒక సందర్భంలో పేర్కొన్నారు.


ఒకసారి షాబాన్ నెల చివరి రోజున అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్(స) ప్రసంగిస్తూ "రాబోతున్న పవిత్ర రమజాన్ మాసంలో ఎవరైనా ఒక సత్కార్యం చేస్తే... ఇతర మాసాల్లో 70 సత్కార్యాలు చేసిన దానితో సమానం" అని వెల్లడించారు.

అనంత కరుణామయుడు, అపార కృపాశీలి అయిన అల్లాహ్ మానవులకు అందించిన పవిత్ర మాసంగా.. సమస్త శుభాలకూ నిలయమైన, సర్వ కారుణ్యాలకు ఆలవాలమైన, సహనాన్నీ, దాతృత్వాన్ని పెంచేది, పేద గొప్ప అనే తారతమ్యాలను తొలగించేదీ, సర్వ మానవ సమానత్వాన్నీ, సౌభ్రాతృత్వాన్నీ, పరస్పర ప్రేమాభిమానాలనూ ద్విగుణీకృతం చేసేది అయిన పుణ్య మాసంగా రమజాన్‌ను పవిత్ర గ్రంథాలు ప్రస్తుతించాయి. అల్లాహ్ సమస్త మానవాళికి పదకొండు నెలలను కేటాయించి, తన కోసం రమజాన్ మాసాన్ని ప్రత్యేకించుకున్నాడు. అందుకే ఆరాధనల్లో అధికభాగం ఈ నెలలోనే నిర్వర్తించాల్సి ఉంటుంది.

విశ్వాసులందరూ పవిత్ర రమజాన్ మాసంలో రోజూ ఒక భాగం అంతిమ పవిత్ర దివ్య ఖుర్ఆన్ తప్పకుండా చదవాలి. అవగాహన చేసుకోవాలి, అమలుపరచాలి, ఇతరులకు చేరవేయాలి. రాత్రి వేళల్లో తరావీహ్, తహజ్జుద్ నమాజులు చేయాలి. సజ్దా (సాష్టాంగం) చేసి అల్లాహ్‌తో కన్నీటి పర్యంతమై మళ్లీ మళ్లీ జీవితంలో తప్పులు చేయకుండా దుఆ (వేడుకోలు) చేయాలి.

పేదవారిని గుర్తించి జకాత్, ఫిత్రా దానాలు ఇవ్వాలి. తాఖ్ రాత్రుల్లో (బేసి రాత్రులు-21,23, 25,27,29) దైవభక్తితో ఆరాధనలు చేయాలి. ఏతేకాఫ్ లాంటి ఆధ్యాత్మిక అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఇవన్నీ తప్పకుండా ఆచరించాలనే గట్టి సంకల్పంతో.. అల్లాహ్‌కు దగ్గర కావాలని దృఢమైన నమ్మకంతో...అతి పవిత్ర రమజాన్ మాసాన్ని హృదయపూర్వకంగా స్వాగతించాలి.

తుదిగీటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**